విశాఖపట్టణం
బుధవారం 20 మే 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.com సంపుటి: 9 సంచిక: 116 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## రాష్ట్రంలో ఇక మినీ మార్టులు

వెయ్యి వరకు ఏర్పాటు చేస్తాం.. సీబీడీసీ ప్రక్రియకు కేంద్రం అనుమతి

మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో కీలక భేటీ

2

## బటన్‌లు నొక్కితే సీఎంలు కాలేరు

వైఎస్ ఆశయాలకు తూట్లు పొడిచారు... జగన్‌పై వైఎస్ షర్మిల ధ్వజం

# తీరం మనకు వరం

వెయ్యి కిలోమీటర్ల సముద్ర తీరంతో అభివృద్ధి

నీళ్లు ఉన్న చోట నాగరికత

మత్స్యకారులకు కూటమి అండగా ఉంటుంది

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి

మత్స్యకారుల సేవలో పథకంలో నగదు జమ





(నెల్లూరు - జయజయహే)

మత్స్యకార కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మత్స్యకారుల సేవలో పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,30,796 మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ భృతిగా రూ.20 వేల చొప్పున ఆర్థికసాయాన్ని ప్రభుత్వం మంగళవారం నాడు విడుదల చేసింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో జరిగే బహిరంగ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని, లబ్ధిదారుల ఖాతాల్లో మొత్తం రూ.262 కోట్లను జమ చేశారు. ఒకవేళ అర్హత ఉండి జాబితాలో పేరు లేని వారు మత్స్యశాఖ కార్యాలయాలను సంప్రదించి లబ్ధి పొందాలని సూచించింది. మత్స్యకారుల సేవలో కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అచ్చెన్నాయుడు, ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు. కావలి మండలం తుమ్మలపెంటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. సముద్రంలోకి నేను వెళ్లలేను. కానీ మీకు ఆ ధైర్యం ఉంది. ఎంత పెద్ద అల వచ్చినా సమర్థంగా ఎదుర్కొని వేట కొనసాగించడం మీకు పుట్టుకతోనే వచ్చిందంటూ మత్స్యకారులను కొనియాడారు. మత్స్యకారులను పట్టించుకున్న మొదటి సీఎం ఎన్టీఆర్ అని, ఆయన బాటలో తమ ప్రభుత్వం నడుస్తుందన్నారు. వెయ్యి ..మిగతా 2లో




## పెట్రో ధరల పెంపు ఆగేది లేదు

లీటరుకు రూ. 13 నుంచి 17 వరకు పెంచాల్సిందే

ఇప్పటికే వారంలో రెండుసార్లు పెంపు

మార్కెట్ వర్గాలు అంచనా

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో, ఇటీవల కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలను రూ.3మేర పెంచిన విషయం తెలిసిందే. అయితే అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో, దేశంగా పెట్రో ధరలు మరింత భారీగా పెంచాల్సిన అవసరం ఉందని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ 'కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్' స్పష్టం చేసింది. దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాలను నివారించాలంటే ఇది తప్పనిసరి అని పేర్కొంది. ఇటీవల చేసిన పెట్రోల్, డీజిల్‌ల ధరల పెంపు ఏమాత్రం సరిపోదని, లీటరుకు అదనంగా మరో రూ.13 నుంచి రూ.17 వరకు పెంచాల్సి ఉంటుందని కోటక్ అభిప్రాయపడింది. పశ్చిమాసియా ..మిగతా 2లో

# విజయ్ ప్రభుత్వం కూలిపోవచ్చు



ఏ క్షణమైనా ముందస్తు ఎన్నికలు

ఇన్ స్టాగ్రామ్ పోస్టులతో టీవీకే గెలిచింది

ఎలక్షన్ కు క్యాడర్ అంతా సిద్ధం కావాలి

డీఎంకే అధినేత ఎం కే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉందని, కాబట్టి పార్టీ శ్రేణులంతా ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ పిలుపునివ్వడం సంచలనంగా మారింది. డీఎంకే జిల్లా కార్యదర్శుల ..మిగతా 2లో



## వారం రోజులు వడగాలులు

అత్యవసర ప్రణాళికలు సిద్ధం.. ఎప్పటికప్పుడు హెచ్చరికలు

క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు

2


## రాజకీయాల్లోకి భూమా మౌనిక

వచ్చే ఎన్నికల్లో పోటీ ఖాయం

భర్త మంచు మనోజ్ ప్రకటన

(హైదరాబాద్ - జయజయహే)

నంద్యాల రాజకీయ గడ్డపై మరో భూమా వారసురాలి గర్జన వినిపించబోతోంది. దివంగత భూమా నాగిరెడ్డి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుని, ఇప్పటికే ప్రజాక్షేత్రంలో చురుగ్గా ఉంటున్న భూమా మౌనిక రెడ్డి నేరుగా ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు ..మిగతా 3లో



## వీధి కుక్కల ఉనికి ఆందోళనకరం

ఇతర ప్రాంతాలకు తరలించాల్సిందే

గత ఉత్తర్వులలో ఎలాంటి మార్పు లేదు

చిన్నారులపై దాడుల ఘటనలను విస్మరించలేం

సర్వోన్నత న్యాయస్థానంల కీలక ఆదేశాలు

ఆదేశాలు పాటించకుంటే కోర్టు ధిక్కరణగా భావిస్తామని హెచ్చరిక



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

వీధికుక్కల అంశంపై సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. గత ఏడాది నవంబర్ నాటి ఉత్తర్వుల్లో ఎలాంటి మార్పులేదన్న సుప్రీం ధర్మాసనం.. పాత ఆదేశాలే కొనసాగుతాయని స్పష్టంచేసింది. బహిరంగ ప్రదేశాల నుంచి వీధికుక్కలను తరలించాలన్న ఆదేశాలను.. వెనక్కి ..మిగతా 3లో



## విశాఖ ట్రాఫిక్ వింగ్‌కు స్పెషల్ ఆఫీసర్

ట్రాఫిక్ నియంత్రణకు సాంకేతిక వినియోగం

కోస్టల్ సెక్యూరిటీని బలోపేతం చేస్తాం

డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడి

2

## ఫ్రీ ఫ్లో టోలింగ్‌లో కొత్త కేటగిరీ

ప్రభుత్వ వాహనాలకు కొత్త సిస్టమ్

శాటిలైట్ ఆధారిత ట్రాకింగ్ ప్లేట్ రికగ్నేషన్

కేంద్ర రవాణా శాఖ విప్లవాత్మక మార్పులు

3

## ఎంఆధార్ యాప్ క్లోజ్

కొత్త యాప్‌ను ఇన్ స్టాల్ చేసుకోవాలి

యూఐడీఏఐ కీలక సిఫారసు

2


# విజయ్ ప్రభుత్వం కూలిపోవచ్చు

మొదటి పేజీ తరువాయి...

సమావేశంలో మాట్లాడిన స్టాలిన్, రాష్ట్రంలో ప్రస్తుతమున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఏ క్షణంలోనైనా ముందస్తు అసెంబ్లీ ఎన్నికలు రావొచ్చని జోస్యం చెప్పారు. ఈ ఓటమి తాత్కాలికమేనని, గతంలో ఎదురైన ఎదురుదెబ్బల నుండి డీఎంకే ఎలా పుంజుకుందో గుర్తుచేస్తూ, రాబోయే రోజుల్లో తమ పార్టీ మళ్లీ అఖండ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వచ్చే 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, మనమంతా సన్నద్ధంగా ఉండి తిరిగి అధికారాన్ని హస్తగతం చేసుకుంటామని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ప్రస్తుత తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ టీవీకే సొంతంగా 107 సీట్లను కలిగి ఉంది. మిత్రపక్షమైన కాంగ్రెస్ ఐదు సీట్లతో పాటు చెరో రెండు సీట్లు ఉన్న మరో నలుగురు మిత్రపక్షాల మద్దతుతో ప్రస్తుతానికి విజయ్ ప్రభుత్వం మెజారిటీని కాపాడుకుంది. వీటికి తోడు గత వారం జరిగిన విశ్వాస పరీక్షలో ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన 25 మంది రెబెల్ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేల మద్దతు కూడా ముఖ్యమంత్రి విజయ్‌కు లభించింది. అయితే ఈ మెజారిటీ ఎక్కువ కాలం నిలవదని డీఎంకే వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వానికి బయటి నుండి మద్దతు ఇస్తున్న వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ వంటి మిత్రపక్షాలు ఏ క్షణంలోనైనా మద్దతు ఉపసంహరించుకునే అవకాశం ఉందని, లేదా తిరుగుబాటు చేసిన ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలపై తమిళనాడు స్పీకర్ గానీ, కోర్టులు గానీ అనర్హత వేటు వేస్తే విజయ్ ప్రభుత్వం తీవ్రమైన రాజకీయ అస్థిరతలో పడటం ఖాయమని డీఎంకే విశ్లేషిస్తోంది.



మరోవైపు డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించిన స్టాలిన్, తమిళనాడు రాజకీయాల్లో ద్రవిడ సిద్ధాంతానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తుచేస్తూ తమిళనాడులో సూర్యుడు (డీఎంకే చిహ్నం) ఎప్పటికీ అస్తమించడు అని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల ఓటమికి పూర్తి వ్యక్తిగత బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించిన ఆయన, తన సొంత నియోజకవర్గమైన కొలత్తూరులో కూడా సీటు కోల్పోవడంపై స్పందిస్తూ, ఈ వైఫల్యాలకు తనదే బాధ్యత అని చెప్పారు. ఇదే సమయంలో పార్టీ డిజిటల్ వ్యూహాన్ని మార్చాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. సోషల్ మీడియాలో విజయ్ నేతృత్వంలోని టీవీకే చాలా ముందుందని పరోక్షంగా అంగీకరిస్తూ.. ఒకప్పుడు తాము టీ దుకాణాలలో చేసిన క్షేత్రస్థాయి రాజకీయాలను, ఇప్పుడు సోషల్ మీడియా వేదికలపై మరింత బలంగా మాట్లాడాల్సిన సమయం ఆసన్నమైందని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ ఘోర పరాజయానికి గల కారణాలను క్షుణ్ణంగా విశ్లేషించి, ప్రజల నుంచి ప్రత్యక్షంగా అభిప్రాయాలను సేకరించేందుకు గానూ స్టాలిన్ 36 మంది సభ్యులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడంతో పాటు పార్టీ ఎక్కడెక్కడ తన సాంప్రదాయ మద్దతును కోల్పోయిందో గుర్తించేందుకే ఈ కమిటీని నియమించినట్లు తెలుస్తోంది. తమిళనాడు ఎన్నికల్లో టీవీకే ఏకైక అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించడం, ద్రవిడ వర్గానికి చెందిన డీఎంకే, ఏఐఏడీఎంకే ప్రతిపక్షంలోకి నెట్టివేయడంతో రాష్ట్ర రాజకీయాలపై ద్రవిడ పార్టీలకు ఉన్న 59 ఏళ్ల సుదీర్ఘ ఆధిపత్యానికి ప్రస్తుతానికి బ్రేక్ పడింది. అయితే తాము ఈ రాజకీయ పరిణామాలకు ఏమాత్రం కలవరపడటం లేదని, విజయ్ ప్రభుత్వం పూర్తి కాలం అధికారంలో కొనసాగుతుందని టీవీకే వర్గాలు ధీమాగా ఉన్నాయి.




# విశాఖ ట్రాఫిక్ వింగ్‌కు స్పెషల్ ఆఫీసర్

(విశాఖపట్నం - జయజయహే)

ప్రజలకు చేరువగా ఉండేందుకు హైవే పక్కన పోలీసుస్టేషన్‌లను ప్రారంభించామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ నియంత్రణకు అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగిస్తామని పేర్కొన్నారు. మంగళవారం కంచరపాలెం ట్రాఫిక్, ఎయిర్ పోర్ట్ ట్రాఫిక్, ఎయిర్ పోర్ట్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ ట్రాఫిక్ వింగ్ కోసం ప్రత్యేక ఐపీఎస్ అధికారిని నియమిస్తామని డీజీపీ తెలిపారు. రానున్న రోజుల్లో ఈ స్టేషన్‌లోనే సైబర్ క్రైమ్ స్టేషన్‌ను ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. కోస్టల్ సెక్యూరిటీ హెడ్‌క్వార్టర్ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. కోస్టల్ సెక్యూరిటీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కోస్టల్ ప్రాంతంలో 21 పోలీసుస్టేషన్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రజా భద్రత, మహిళల రక్షణే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. మహిళలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కొవాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సూచించారు.

# బటన్‌లు నొక్కితే సీఎంలు కాలేరు

## వైఎస్ ఆశయాలకు తూట్లు పొడిచారు

## జగన్‌పై వైఎస్ షర్మిల ధ్వజం

(విజయవాడ - జయజయహే)



వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. మంగళవారం విజయవాడ వేదికగా షర్మిల మీడియాతో మాట్లాడారు. నేటికి వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై ప్రజలకు అపారమైన అభిమానం, ప్రేమ ఉన్నాయని వ్యాఖ్యానించారు. భూతద్దం పెట్టి వెతికినా వైఎస్ లాంటి వారు పుట్టరని చెప్పుకొచ్చారు. వైఎస్ పేరు చెప్పుకుని జగన్ ఒక్క ఛాన్స్ అంటూ పాదయాత్ర చేశారని షర్మిల అన్నారు. ఆయన సీఎం అయ్యాక స్విచ్‌లు నొక్కడం తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం స్విచ్‌లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు అవరనేది కొంతమంది తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ మధ్య నాయకులు సీఎం అవగానే ఎంపీ, ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. వైఎస్సార్ రెండోసారి సీఎం అయ్యాక ప్రజల వద్దకు వెళ్లాలని నిర్ణయించారని.. ఈ క్రమంలో రచ్చబండకు వెళ్తుండగా చనిపోయారని ప్రస్తావించారు. తండ్రి ఆశయాలను సాధిస్తామని చెప్పి.. ఓట్లు వేయించుకున్న వారు.. ఆ తర్వాత ఆయన ఆశయాలనే నాశనం చేశారని షర్మిల దుయ్యబట్టారు. నిన్న సిగ్గులేకుండా వైసీపీ నేతలు ధర్నాలు చేశారని సెటైర్లు గుప్పించారు. వాళ్ల ప్రభుత్వంలో భారాలు మోపిన విషయాలు మరిచారా..? అని ప్రశ్నించారు. జగన్ సీఎం అయ్యాక కూడా ప్రధాని మోదీ చెప్పినట్లుగా తల ఆడించారని విమర్శించారు. బీజేపీతో జగన్ అక్రమ పొత్తు పెట్టుకున్నారని షర్మిల ఎద్దేవా చేశారు.

# ఎంఆధార్ యాప్ క్లోజ్

## కొత్త యాప్‌ను ఇన్ స్టాల్ చేసుకోవాలి

## యూఐడీఏఐ కీలక సిఫారసు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఆధార్ కార్డు ఉన్నవారికి బిగ్ అలర్ట్. యూఐడీఏఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఎంఆధార్ యాప్‌ను పూర్తిగా నిలిపివేసింది. యాప్ సేవలను పూర్తిస్థాయిలో నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇక నుంచి కొత్త ఆధార్ యాప్‌ను మాత్రమే ఉపయోగించాలని సూచించింది. కొత్త ఆధార్ యాప్ అందరూ వాడాలని యూఐడీఏఐ సిఫార్సు చేసింది. కొత్త యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. కేంద్రం గత ఏడాది డిసెంబర్‌లో ఆధార్ కొత్త యాప్‌ను ప్రారంభించింది. ఆ యాప్‌లో అన్నీ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఎంఆధార్ యాప్ సేవలను నిలిపివేశారు. "ఎంఆధార్ యాప్ త్వరలో నిలిపివేయబడుతోంది. ఇప్పుడు కొత్త ఆధార్ యాప్‌తో మరింత స్మార్ట్, వేగవంతం, సురక్షితమైన డిజిటల్ ప్రయాణాన్ని అనుభవించండి. సురక్షితమైన క్యూఆర్ ఆధారిత ఆధార్ షేరింగ్ నుండి మెరుగైన గోప్యతా నియంత్రణలు, ఆధార్ సేవలకు నిరంతరాయ యాక్సెస్ వరకు.. మీ డిజిటల్ గుర్తింపు అనుభవాన్ని సరళతరం చేయడానికి ఈ కొత్త యాప్ రూపొందించబడింది. ఆధార్ యాప్‌ను ఇప్పుడే డౌన్‌లోడ్ చేసుకోండి" అంటూ యూఐడీఏఐ పేర్కొంది.

### క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే..

ఈ ఏడాది జనవరి 28న ఆధార్ యాప్ కొత్త వెర్షన్‌ను కేంద్రం విడుదల చేసింది. ఇందులో మరిన్ని ఫీచర్లను జోడించింది. ఈ యాప్‌లో మీరు ఎక్కడినుంచైనా, ఎప్పుడైనా వివరాలను అప్డేట్ చేసుకోవచ్చు. అంతేకాకుండా మీ ఆధార్‌లో ఏ వివరాలు అయితే అవసరమో వాటిని మాత్రమే ఇతరులతో షేర్ చేసుకోవచ్చు. గతంలో ఆధార్ కార్డులను డిజిటల్‌గా నిల్వ చేసుకునేందుకు ఎంఆధార్ యాప్ ఉపయోగించేవారు. అయితే ఈ యాప్ ద్వారా ఎలాంటి సమాచారాన్ని అప్డేట్ చేసుకోవడం కుదరదు. కొత్త ఆధార్ యాప్‌లో అన్నీ సేవలు ఒకేచోట లభిస్తున్నాయి. దీంతో ఎంఆధార్ యాప్‌ను నిలిపివేశారు. అయితే కొత్త యాప్‌లో క్యూఆర్ కోడ్ గుర్తింపు ధృవీకరణ ఫీచర్ అందుబాటులో ఉంది. అంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఆధార్ ధృవీకరణ పూర్తవుతుంది. దీంతో మీరు జిరాక్స్ కాపీ ఇవ్వాల్సిన అవసరం లేకుండా ఆధార్ యాప్‌లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. మీరు సిమ్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ఓపెనింగ్, హోటళ్లు, దేవాలాయాల్లో అవసరమైన చోట సులువుగా ధృవీకరణ ప్రక్రియ పూర్తి చేయొచ్చు.

# రాష్ట్రంలో ఇక మినీ మార్టులు

## వెయ్యి వరకు ఏర్పాటు చేస్తాం

## సీబీడీసీ ప్రక్రియకు కేంద్రం అనుమతి

## మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

## కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో కీలక భేటీ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మినీ మార్టులను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రెండో రోజు దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఏపీకి సంబంధించిన పలు కీలక అంశాలపై వారితో చర్చించారు. విశాఖ, విజయవాడలో సీబీడీసీ ప్రక్రియకు అనుమతి వచ్చిందని కేంద్ర మంత్రులతో నిర్వహించిన సమావేశం అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు. మరో నెల రోజుల్లోనే సీబీడీసీకి సాంకేతికత, డేటా సేకరించుకొని ప్రారంభిస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. అదే విధంగా రాబోయే రోజుల్లో వెయ్యి మినీ మార్టుల ఏర్పాటుకు అధికారులు ముందుకొచ్చారని తెలియజేశారు. కంది, మినప వారే సరఫరా చేసి మార్కెట్ కంటే తక్కువ ధరలో ఉండేలా ఏర్పాట్లు చేస్తారని నాదెండ్ల పేర్కొన్నారు. మిల్లెట్స్‌నూ మినీ మార్టుల ద్వారా అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ చేపడతామని మంత్రి నాదెండ్ల అన్నారు. నాణ్యమైన వస్తువులను తక్కువ ధరకు అందించేలా ఏర్పాట్లు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రెండో రోజు ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ప్రధాన ధ్యేయంగా ఈ పర్యటన సాగుతున్నట్లు తెలుస్తోంది. పౌరసరఫరాల వ్యవస్థ బలోపేతం, వినియోగదారులకు మెరుగైన సేవల అందించడంపై దృష్టి సారిస్తూ పలు కీలక ఉన్నతస్థాయి సమావేశాలను మంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ కార్యదర్శి కన్నబాబుతో కలిసి, కేంద్ర పెట్రోలియం సహజ వాయు మంత్రిత్వ శాఖ కార్యదర్శి డా. నీరజ్ మిట్టల్, సంయుక్త కార్యదర్శి సుజాత శర్మతో సమావేశమయ్యారు. అదే విధంగా రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలు, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే విధానాలు, సరఫరా వ్యవస్థలో సమన్వయం పెంపు వంటి అంశాలపై మంత్రి నాదెండ్ల విస్తృతంగా చర్చించారు. అనంతరం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ప్రజా పంపిణీ శాఖ గౌరవ కేంద్ర మంత్రివర్యులు ప్రహ్లాద్ జోషిని మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా పౌరసరఫరాల నిర్వహణ, వినియోగదారుల సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు పారదర్శకమైన సేవల అందజేత, కేంద్ర-రాష్ట్ర సమన్వయంపై చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ సమావేశాల సందర్భంగా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన సమర్థవంతమైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# పెట్రో ధరల పెంపు ఆగేది లేదు

ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు ఇంకా ఇలానే కొనసాగితే పరిస్థితి దారుణంగా ఉంటుందని తెలిపింది. ఇంధన ధరల పెంపు, బంగారం దిగుమతి సుంకాల పెంపు, పొదుపు చర్యలు వంటి భారత ప్రభుత్వ నిర్ణయాలు దేశ ఆర్థిక సవాళ్లను పూర్తిగా పరిష్కరించలేకపోవచ్చని అభిప్రాయపడింది. ఇటీవల కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలను రెండు సార్లు పెంచారు. ఇంతకు ముందు లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలను రూ.3 మేర పెంచగా, మంగళవారం మరో 90 పైసలు మేర వడ్డించారు. అయినప్పటికీ ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు వస్తున్న నష్టాలను పూడ్చుడానికి ఈ పెంపు ఏమాత్రం సరిపోదని కోటక్ భావిస్తోంది. చమురు విక్రయాల ద్వారా వస్తున్న రాబడి తక్కువగా ఉండడం వల్ల ఓఎంసీలు ప్రస్తుతం ప్రతి నెలా దాదాపు రూ.25వేల కోట్లు మేర నష్టాన్ని చవిచూస్తున్నాయని కోటక్ అంచనా వేసింది. ప్రస్తుతం డీజిల్ అమ్మకాలపై లీటర్‌కు రూ.11.40 నష్టం, పెట్రోల్ అమ్మకాలపై లీటర్‌కు రూ.14.30 నష్టం వస్తున్నట్లు అంచనా. ఈ నష్టాలను పూడ్చాలంటే, పెట్రో ధరలను లీటర్‌కు రూ.13-17 వరకు పెంచాల్సిందేనని స్పష్టం చేసింది.

### దశలవారీగా పెంపు

ఇప్పటికే పెరిగిన ఇంధన ధరలో ప్రజలు ఇబ్బంది పడుతుంటే, మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ఇక్కడితో ఆగిపోదని నివేదికలు సూచిస్తున్నాయి. గత 75 రోజులుగా పేరుకుపోయిన నష్టాలను రికవరీ చేసేందుకు చమురు కంపెనీ ప్రయత్నిస్తున్నాయని, అయితే ఒకేసారి కాకుండా క్రమంగా (దశలవారీగా) పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎందుకంటే, వినియోగదారులపై ఒక్కసారిగా ద్రవ్యోల్బణ భారం పడకుండా చూసేందుకు విధానకర్తలు, చమురు కంపెనీలు జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాయి. కాగా, వినియోగదారులను రక్షించడానికి, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను పరిమితం చేసేందుకు ధరలను క్రమంగా పెంచాలని భావిస్తున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) అధికారి ఒకరు తెలిపారు. మే 15 నాటి ధరల పెంపు వల్ల చమురు కంపెనీల రోజువారీ నష్టాలు నాలుగో వంతు తగ్గినప్పటికీ, అంతకు ముందు వారు రోజుకు దాదాపు రూ.750 కోట్ల నష్టాన్ని చవిచూశారని పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ ఈ వారం ప్రారంభంలోనే చెప్పారు. మరోవైపు నష్టాలు కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో రిటైల్ ఇంధన ధరలు 10 శాతం మేర పెరిగే ఛాన్స్ ఉందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు కూడా అంచనా వేసింది.

# వారం రోజులు వడగాలులు

## అత్యవసర ప్రణాళికలు సిద్ధం

## రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు

(అమరావతి - జయజయహే)

కోస్తాంధ్ర జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వచ్చే ఏడు రోజుల పాటు అన్ని పట్టణ స్థానిక సంస్థలు అత్యవసర వాతావరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించింది. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. ముఖ్యంగా మధ్య, ఉత్తర కోస్తా జిల్లాల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రేపటి నుంచి ఈనెల 26 వరకు వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఎండల బారిన పడే ప్రమాదం ఉన్న ప్రజలను రక్షించడానికి, పౌర సేవలకు అంతరాయం కలగకుండా చూడడానికి వడదెబ్బ మరణాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు మైకులు, సోషల్ మీడియా, వార్డు సచివాలయాలు, మున్సిపల్ వాహనాలు, మీడియా, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డుల ద్వారా వడగాల్పుల హెచ్చరికలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

బస్టాండ్లు, మార్కెట్లు, కార్మికులు కూడే ప్రాంతాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, అన్నక్యాంటీన్లు ఇతర బహిరంగ ప్రదేశాలలో తాగునీటి సదుపాయాలు కల్పించాలన్నారు. ఇందుకోసం తాత్కాలిక వాటర్ కియోస్క్‌లు, అవసరమైన చోట చల్లని నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు, బహిరంగ ప్రదేశాల్లో పని చేసే శ్రామికులు, వీధి వ్యాపారులు, నిరాశ్రయులు, వృద్ధుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకుంటూ వార్డు స్థాయి పర్యవేక్షణ బృందాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉండే మధ్యాహ్నం వేళల్లో మున్సిపాలిటీకి సంబంధించిన బహిరంగ పనులను క్రమబద్ధీకరించాలని, పారిశుద్ధ్య సేవలు, తాగునీటి సరఫరా, నీటి నాణ్యత పరిశీలన నిరంతరం కొనసాగేలా చూడాలన్నారు. అత్యవసర సేవలు, ఫిర్యాదుల స్వీకరణ కోసం కంట్రోల్ రూమ్‌లను నిరంతరం అందుబాటులో ఉంచాలని సూచించారు. పరిస్థితి తీవ్రతను వివరిస్తూ మున్సిపల్ కమిషనర్లు అంతా క్షేత్రస్థాయి ఏర్పాట్లను ప్రతిరోజూ స్వయంగా పర్యవేక్షించాలని ఎస్. సురేష్ కుమార్ స్పష్టం చేశారు.

# పెట్రో ధరల పెంపు ఆగేది లేదు


మొదటి పేజీ తరువాయి...

కిలోమీటర్ల తీరం ఉండటం మనకు వరం అన్నారు. నీళ్లు ఉన్నచోట నాగరికత అభివృద్ధి చెందింది. కృష్ణా నదితో విజయవాడ అభివృద్ధి చెంది. ఇక్కడ సోమశిల ఉండటంతో నెల్లూరు డెవలప్ అవుతోంది. గోదావరి నదితో రాజమండ్రి దిగ్విజయంగా ఉంది. తీర ప్రాంత జిల్లాలు, మత్స్యకారుల జీవితాల్లో మార్పు తీసుకురావాలని కూటమి ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఎన్నికల హామీని నెరవేరుస్తూ, గతంలో ఉన్న సాయాన్ని భారీగా పెంచి, ఒక్కో అర్హత కలిగిన కుటుంబానికి రూ. 20,000 చొప్పున ప్రభుత్వం నేరుగా మత్స్యకారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. సముద్రంలో మత్స్య సంపద పెంపొందించేందుకు వీలుగా ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు వేటపై నిషేధం విధిస్తారు. ఈ పథకం కింద మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లపై ఆధారపడే లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ద్వారా నగదు బదిలీ అవుతుంది.

# ఫ్రీ ఫ్లో టోలింగ్‌లో కొత్త కేటగిరీ

### ప్రభుత్వ వాహనాలకు కొత్త సిస్టమ్
### శాటిలైట్ ఆధారిత ట్రాకింగ్ ప్లేట్ రికగ్నేషన్
### కేంద్ర రవాణా శాఖ విప్లవాత్మక మార్పులు

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**




దేశవ్యాప్తంగా మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ విధానాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో టోల్ మినహాయింపు పొందిన వాహనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త కేటగిరీ ఫాస్ట్‌ట్యాగ్‌ను రూపొందించడానికి ప్లాన్ చేస్తోంది. తాజా నివేదిక ప్రకారం పూర్తిగా ఆటోమేటెడ్, బారియర్ రహిత టోల్ వసూళ్ల ప్రక్రియలో రక్షణ, పోలీస్, ఇతర ప్రభుత్వ వాహనాలకు ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను తొలగించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం కొన్ని ప్రభుత్వ రంగ వాహనాలకు టోల్ ఫీజు నుండి మినహాయింపు ఉంటుంది. అయితే కొత్త ఆటోమేటెడ్ విధానం వల్ల ఆయా వాహనాలకు ఇబ్బందులు కలగకుండా చూడటానికి ఈ కొత్త సిస్టమ్‌ను డిజైన్ చేస్తున్నారు. ప్రస్తుత మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో విధానంలో టోల్ ఫీజులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , శాటిలైట్ ఆధారిత ట్రాకింగ్, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ టెక్నాలజీ సహాయంతో డిజిటల్ పద్ధతిలో వసూలు చేస్తున్నారు. ఈ విధానం వల్ల వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగకుండానే చాలా వేగంగా వెళ్ళిపోవచ్చు. సాధారణ ప్యాసింజర్ కార్లు, కమర్షియల్ వాహనాలకు ఈ సిస్టమ్ బాగానే పనిచేస్తున్నప్పటికీ సాయుధ దళాలు, పారామిలటరీ, పోలీస్ శాఖలు ఉపయోగించే టోల్ మినహాయింపు వాహనాలకు కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ రకమైన స్పెషల్ వాహనాలు సిస్టమ్‌లో సరిగ్గా రిజిస్టర్ కాకపోతే లేదా టెక్నాలజీ వాటిని గుర్తించలేకపోతే పొరపాటున టోల్ ఛార్జీలు కట్ అవ్వడం లేదా ఈ-చలాన్లు జనరేట్ అవ్వడం లాంటివి జరుగుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా టోల్ మినహాయింపు వాహనాల కోసం ప్రత్యేకంగా కాన్ఫిగర్ చేసిన ఫాస్ట్‌ట్యాగ్ కేటగిరీని తీసుకురానున్నారు. ఈ స్పెషల్ ట్యాగ్‌లు ఉండటం వల్ల రక్షణ సంస్థలు, కొన్ని ఎంపిక చేసిన ప్రభుత్వ ఏజెన్సీలకు చెందిన అధికారిక వాహనాలు ఎలాంటి టోల్ డిడక్షన్ లేదా వయలేషన్ నోటీసులు లేకుండానే ఆటోమేటెడ్ లేన్ల ద్వారా సులువుగా ప్రయాణించవచ్చు. ఆర్మీకి చెందిన అధికారిక మిలిటరీ వాహనాలకు కొన్నిసార్లు ఫాస్ట్‌ట్యాగ్ కూడా అవసరం లేని విధంగా ప్లాన్ చేస్తున్నారు. ఈ సిస్టమ్ నేరుగా డిఫెన్స్ నంబర్ ప్లేట్లను గుర్తించి, జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆ వాహనాల కదలికల డేటాను వెంటనే డిలీట్ చేసేలా డిజైన్ చేస్తున్నారు.





## కాఫీ పంటలను మరింత విస్తృతం చేస్తాం.

### కేంద్ర కాపీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు.

**అనంతగిరి, (జయ జయహే)**

ఏజెన్సీ గిరిజన ప్రాంతాలలో కాపీ పంట మరింత విస్తృతం చేస్తామని కేంద్ర కాపీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు అన్నారు. మంగళవారం ఆయన అనంతగిరి మండలంలోని హెక్టాగూడ గ్రామంలో కాఫీ నర్సరీ మొక్కలను సందర్శించారు. అనంతరం రైతుల సమస్యలపై ఆరా తీయగా గత ఎనిమిది సంవత్సరాల నుంచి తుప్పలు కొట్టింది,గుంతకల్వాలు, బెంచ్ కటింగ్,మల్చింగ్,బుష్కులేరింగ్,లైన్ మార్కింగ్ 7 అడుగుల గుంతలు తవ్వడం,గుంతకప్పడం, గాతముయడం,మొక్కలు నాటడం, ఫ్రెంచి టెర్రసింగ్ వంటి పనులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం నేటికీ అందలేదని గ్రామస్తులు తెలిపారు. అనంతరం అనంతగిరి మండలం హార్టికల్చర్ కన్సల్టెంట్ ఈశ్వరరావు తో కలిసి మొక్కల పాలిథిన్ కవర్లను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనంతగిరి మండలంలో 750 ఎకరాలతో ప్రారంభమైన కాపీ పంట నేటికీ 14000 ఎకరాలకు సాగుబడి జరుగుతుందని అందులో 7500 ఎకరాలలో కాఫీ దిగుబడి కొనసాగుతుందని తెలిపారు. 2026- 27 సంవత్సరం సంబంధించి మరో 750 ఎకరాలు సాగులో వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఒక్కొక్క ఎకరానికి 1000 పాలిథిన్ కవర్లు సరఫరా చేస్తున్నామన్నారు. ఇదివరకే సాగులో ఉన్న పాత తోటలకు ఎకరాకు 450 కాఫీ పాలిథిన్ కవర్లు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రైమరీ నర్సరీ మొదలుకొని సెకండరీ నర్సరీ విధానంలో ఈ యొక్క కాఫీ పాలిథిని కవర్లు సరఫరా చేస్తామన్నారు. కాఫీ దిగుబడి తర్వాత ట్రాన్స్ ప్లాంటింగ్ విధానం ద్వారా రైతులు పంటలను అమ్ముకోవచ్చు అన్నారు. అనంతగిరి మండలంలోని వేల ఎకరాల్లో కాఫీ పంట దిగుబడి కొనసాగుతున్న కనీసం పూర్తిస్థాయి కార్యాలయం లేదని అలాగే పూర్తిస్థాయి సిబ్బంది లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే కాఫీ సమస్యల కోసం కలెక్టర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ తో మాట్లాడి సమస్యను అధిగమించి ప్రయత్నం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాఫీ లైజెన్ వర్కర్లు అప్పన్న,మోష్య, సీతారం, రాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



## అల్లూరి వర్ధంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్..

**కొయ్యూరు :(జయ జయహే )న్యూస్ మే 20.**

అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి సందర్భంగా కొయ్యూరు మండలం మంప గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు అందజేశారు. మంప గ్రామ యువకుల ఆధ్వర్యంలో మండల స్థాయి టోర్నమెంట్ నిర్వహించారు. కొయ్యూరు, గొలుగొండ, చింతపల్లి మండలాల నుండి 12 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి రూ. 15,000 మరియు ట్రోఫీ మంప యూత్ జట్టు ఫైనల్లో చింతవాణిపాలెం జట్టుపై విజయం సాధించింది ద్వితీయ బహుమతి రూ. 10,000 మరియు ట్రోఫీ, చింతవాణిపాలెం జట్టు రన్నరప్‌గా నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్ అవార్డులు కూడా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీటీసీ శివరామరాజు, వీఆర్ఓ పండయ్య, స్థానిక పెద్దలు హాజరయ్యారు. వారి చేతుల మీదుగా విజేతలకు నగదు, షీల్డులు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ శివరామరాజు మాట్లాడుతూ “అల్లూరి త్యాగం, పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని ఇస్తాయి. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి అల్లూరి ఆశయ సాధనకు, గ్రామాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు పాటుపడాలి అని పిలుపునిచ్చారు. గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.




## ఏం గదబూరు అంగన్వాడి సెంటర్లో కిషోర్ వికాస వేసవికాల శిక్షణ

జిల్లా మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ సాధికారత అధికారి, జిల్లా బాల సంరక్షణ అధికారి వారి ఆదేశాలు మేరకు మాడుగుల మండలంలో ఏం గదబూరు అంగన్వాడి సెంటర్లో మంగళవారం కిషోర్ వికాస్ వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెషన్- 6 “చట్టాలపై అవగాహన వాటి ప్రాముఖ్యత “ గురించి వివరించారు. “కిశోర వికాస వేసవికాలం శిక్షణ కార్యక్రమాలు”11 సంవత్సరం నుండి 18 సంవత్సరాల లోపు గల కౌమారదశ బాల బాలికలకు గ్రామస్థాయిలో సంఘాలను ఏర్పాటు చేసి వారంలో ప్రతి మంగళవారం, శుక్రవారం బాలుడికి వీటి ద్వారా కౌమార దశలో గల పిల్లల సమస్యలు గురించి చట్టాలపై అవగాహన వాటి ప్రాముఖ్యత ఫోక్సో యాక్ట్ ,చైల్డ్ మ్యారేజ్, రైట్ టు ఎడ్యుకేషన్, పిల్లలందరినీ సక్రమ మార్గం వైపు తీసుకువెళ్లడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. అలాగే బాల బాలికలు ఎవరు కూడా రక్తహీనత గురికాకుండా ఆరోగ్య సమస్యల నుండి ఎలాగా మెరుగుపడాలని, ఎలాంటి ఆహారం తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ప్రాజెక్ట్ సిడిపిఓ ఎర్రయమ్మ , సూపర్వైజర్ ఈశ్వరి , అంగన్వాడి కార్యకర్తలు, ఆశవర్కర్, డిసిపియు సామాజిక కార్యకర్త పి.మంగ తదితరులు పాల్గొన్నారు.



## పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయం

**మాడుగుల మే 19 జయ జయహే**

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శ నీయమనీ వ్యవసాయకార్మికసంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె భవానీ పేర్కొన్నారు. మంగళవారం మాడుగుల మండలం ఆవురువాడ ఉపాధి పనుల వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె సిపిఎం నిర్మాతల్లో ఒకరైన దర్శజీవి సుందరయ్య వర్ధంతి ని ఘనంగా నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భవానీ మాట్లాడుతూ పీడిత ప్రజలు విముక్తి కోసం జీవితాన్ని త్యాగం చేసి ఉత్తర భారత దేశంలో పార్టీ నిర్మించి అనేక పోరాటాలు చేసిన వ్యక్తి సుందరయ్యని పేర్కొన్నారు.ప్రజలు కోసం పిల్లలను వద్దు అనుకుని జీతం చివరి వరకు ప్రజలు కోసం జీవించిన గోప్ప వ్యక్తి చమసుందరయ్యని పేర్కొన్నారు. అయన అడుగు జాడల్లో నడవడానికి భవిష్యత్ లో ప్రజాఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అదిక సంఖ్యలో కూలీలు పాల్గోన్నారు .

## పిల్లల భవిష్యత్‌కు ప్రభుత్వ పాఠశాలలు బాసటగా నిలుస్తాయి

**బుచ్చయ్య పేట జయ జయహే**



బుచ్చయ్యపేట ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన విద్యా బోధన సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ విద్యార్థులు చేర్పించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లా పరిశీలకులు పి.ఏసుబాబు, పి. పవన్ కుమార్ లు తెలిపారు. మంగళవారం మండలంలో గల దిబ్బిడి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను కలిసారు.ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలను వివరించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని, పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు బాటగా నిలుస్తాయి అన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించడానికి అంగీకార పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-1 గీత, మండల విద్యాశాఖ అధికారి- 2. బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు, పి అచ్చం నాయుడు, ఎస్.గోవిందు, ఎస్.దుర్గాప్రసాద్, గ్రామ పెద్దలు గొన్నబత్తుల శ్రీనివాసరావు, సానపతి శ్రీనివాసరావు, పోలరాజు, తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయాల్లోకి భూమా మౌనిక

మొదటి పేజీ తరువాయి...

టాలీవుడ్ హీరో, ఆమె భర్త మంచు మనోజ్ స్పష్టం చేశారు. భూమా కుటుంబం నుంచి మరో కీలక నాయకురాలు అసెంబ్లీ బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. మంచు మనోజ్ భార్య భూమా మౌనిక రెడ్డి రాబోయే ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు వెలువడిన అధికారిక ప్రకటన ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఈ దంపతులు కలిసి ప్రారంభించిన ఐక్య ధైర్య సేన సమితి కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితమని చెబుతూనే, మౌనిక రాజకీయ అరంగేట్రంపై మనోజ్ క్లారిటీ ఇచ్చారు. దీంతో భూమా నాగిరెడ్డి ఆశయ సాధన కోసం మౌనిక ప్రత్యక్ష రాజకీయాల్లో తనదైన ముద్ర వేయబోతున్నట్లు స్పష్టమవుతోంది. భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డిల ద్వితీయ కుమార్తె మౌనికకు రాజకీయాలు కొత్తేమీ కాదు. భూమా నాగిరెడ్డి మరణం తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తన సోదరి భూమా అఖిలప్రియ విజయం కోసం గర్భిణీగా ఉండి కూడా ఆమె చేసిన పాదయాత్ర, ప్రసంగాలు అప్పట్లో అందరినీ ఆకట్టుకున్నాయి. మౌనికలో ఉన్న వాగ్ధాటి, ప్రజలతో మమేకమయ్యే నైజం భూమా అనుచరుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. కేవలం ఒక సెలబ్రిటీ భార్యగానే కాకుండా, కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు అండగా నిలిచే ధైర్యవంతురాలిగా ఆమెకు పాత నంద్యాల జిల్లాలో మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో భూమా అఖిలప్రియ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే మౌనిక రెడ్డి మాత్రం కేవలం తన సోదరి వెనుక ఉండిపోయే పాత్రకు భిన్నంగా, సొంతంగా తన రాజకీయ భవితవ్యాన్ని నిర్మించుకోవాలని భావిస్తున్నారు. తన తండ్రికి కంచుకోట లాంటి నంద్యాల నియోజకవర్గం లేదా సమీప ప్రాంతాల్లో ఆమె పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకోవడానికి ఐక్య ధైర్య సేన ద్వారా ఆమె చేస్తున్న పర్యటనలు ఎన్నికల ముందు బలమైన పునాదిగా మారుతున్నాయి. మౌనిక పోటీ చేయడం ఖాయమని మనోజ్ ప్రకటించినప్పటికీ, ఏ పార్టీ నుంచి బరిలోకి దిగుతారనే విషయాన్ని మాత్రం సస్పెన్స్‌గా ఉంచారు. కుటుంబ గౌరవాన్ని కాపాడుతూ, ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చే ఏ పక్షం వైపు అయినా మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. భూమా మౌనిక రెడ్డి రాకతో నంద్యాల, ఆళ్లగడ్డ పాలిటిక్స్ మరింత ఆసక్తికరంగా మారబోతున్నాయి. సోదరి అఖిలప్రియతో కలిసి పని చేస్తారా లేక స్వతంత్రంగా తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటారా అన్నది వేచి చూడాలి.

## వీధి కుక్కల ఉనికి ఆందోళనకరం

మొదటి పేజీ తరువాయి...



తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. కుక్కకాట్ల ఘటనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఇది ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశమని.. కుక్కకాట్లను తేలికగా తీసుకోవద్దని చెప్పింది. కుక్క కాట్లను విస్మరించలేం.. ప్రజా ప్రదేశాల నుండి వీధి కుక్కలను తరలించి, వాటిని తిరిగి ఆ ప్రాంతాల్లోకి వదలకుండా చూడాలని పేర్కొంది. వీధులు, బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తొలగించాలంటూ నవంబర్ 2025లో జారీ చేసిన ఉత్తర్వును సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. ప్రత్యేకంగా, వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్స చేసిన తర్వాత వాటిని ఆ ప్రదేశాలలోకి వదలకూడదన్న తన ఉత్తర్వును ఉపసంహరించుకోవడానికి అది నిరాకరించింది. అయితే, వాటిని వేరే చోటికి తరలించడం వల్ల అవి గందరగోళానికి గురై, మరిన్ని దాడులకు దారితీయవచ్చని జంతుప్రేమికులు వాదించారు. అయితే, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం దీనితో విభేదించి, బహిరంగ ప్రదేశాలలో వీధి కుక్కల ఉనికిని “ఆందోళనకరం”గా అభివర్ణించింది. ఆ జంతువులు ప్రజలపై, ముఖ్యంగా పిల్లలపై దాడి చేసిన సంఘటనలను తాము విస్మరించలేమని కోర్టు పేర్కొంది. ఇది ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశమని.. ఏబీసీ అమలు చేయడంలో నిర్లక్ష్యంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది.. ఢిల్లీ ఐజీఐ విమానాశ్రయంలో పదేపదే కుక్కకాటు ఘటనలు జరగడం తీవ్ర అసమర్థతకు నిదర్శనమని పేర్కొంది. సూరత్‌లో జర్మన్ ప్రయాణికుడిని కుక్క కరవడం.. పట్టణ పరిపాలనపై విశ్వాసాన్ని దెబ్బతీసిందని పేర్కొంది. రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌లో ఒక్క నెలలోనే.. ఒక వెయ్యి 84 కుక్కకాటు కేసులు నమోదయ్యాయని పేర్కొంది. కోర్టు ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయని రాష్ట్రాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇకపై ఆదేశాలు పాటించని రాష్ట్రాలపై.. ‘కోర్టు ధిక్కార’ చర్యలు తప్పవు అని సుప్రీంకోర్టు హెచ్చరించింది. “పెరుగుతున్న వీధి కుక్కల జనాభాకు అనుపాతంగా మౌలిక సదుపాయాలను విస్తరించడానికి, వాటి పరిమాణాన్ని నిర్ధారించడానికి జరిగిన ప్రయత్నాలు కొరవడ్డాయి.. ఆ ప్రయత్నాలు అడపాదడపాగా, సంస్థాగత లోతు లేకుండా కొనసాగాయి. వంధ్యీకరణ, టీకా కార్యక్రమాలు ఎలాంటి ప్రణాళిక లేకుండా జరిగాయి...” అని కోర్టు పేర్కొంది. “ఇది (జంతు జనన నియంత్రణ) చట్టం లక్ష్యాలను దెబ్బతీస్తుంది,” అని న్యాయస్థానం వాదించింది.. “రాష్ట్రాలు ముందుచూపుతో వ్యవహరించి ఉంటే, ప్రస్తుత పరిస్థితి ఇంత తీవ్ర స్థాయికి చేరి ఉండేది కాదు.” అని పేర్కొంది. రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలు ఏడబ్ల్యూబీఐ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలి. రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలు ప్రతి జిల్లాలో కనీసం ఒక జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలు రాబిస్ నిరోధక టీకాలు -- ఇమ్యునోగ్లోబులిన్‌లు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలి. ఈ ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత గల అధికారులు తమ విధులను నిర్వర్తించేటప్పుడు వారికి రక్షణ కల్పించాలి -- అనగా, సాధారణంగా వారిపై ఎలాంటి పోలీసు కేసులు నమోదు చేయకూడదు అని ఇవాల్టి ఆదేశాల్లో సుప్రీంకోర్టు పేర్కొంది.

For a pure tomorrow..
జయహో



## తెలంగాణలో ప్రపంచ స్థాయి విపత్తు నిర్వహణ వ్యవస్థ

(సి.హెచ్.ప్రతాప్)

తెలంగాణ రాష్ట్రం విపత్తు రక్షణ రంగంలో సరికొత్త సాంకేతికత వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ప్రకృతి విపత్తులు, వరదలు, అగ్నిప్రమాదాల వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణరక్షణ, ఆస్తినష్టం తగ్గింపు, మరియు తక్షణ స్పందనే ధ్యేయంగా ప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళికలను అమలు చేస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన భారీ మాక్ డ్రిల్ రాష్ట్ర ప్రభుత్వ సన్నద్ధతకు మరియు ఆధునిక సాంకేతికతపై ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. ప్రపంచంలో అందుబాటులో ఉన్న అత్యాధునిక పరికరాలు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థలు, మరియు ముందస్తు హెచ్చరికల విధానాలను రాష్ట్ర విపత్తు నిర్వహణ వ్యవస్థలో అనుసంధానించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతికతను ఉపయోగించి విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతి ఒక్క పౌరుడి ప్రాణాన్ని కాపాడటం, ప్రజా ఆస్తులను రక్షించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్స్ కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాదు; విపత్తు సంభవించినప్పుడు వివిధ ప్రభుత్వ విభాగాలు ఎంత సమన్వయంతో స్పందిస్తున్నాయో పరీక్షించే ఒక ప్రాక్టికల్ లైవ్ టెస్ట్. ఈ రకమైన అభ్యాసాల ద్వారా ప్రమాద సంకేతాలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లే సైరన్ల పనితీరును, ప్రమాద స్థలాల నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చే తరలింపు ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తారు. అలాగే గాయపడిన వారికి తక్షణ ప్రాథమిక చికిత్స అందించే వైద్య సహాయక చర్యలను, వైర్‌లెస్ మరియు ఇతర నెట్‌వర్క్‌ల ద్వారా వివిధ విభాగాల మధ్య సాగే కమ్యూనికేషన్ సమన్వయాన్ని ఇందులో నిరంతరం పరీక్షిస్తుంటారు. హైదరాబాద్‌లోనే కాకుండా నిజామాబాద్ వంటి జిల్లాల్లో కూడా వరద ముప్పును తట్టుకునేందుకు వీలుగా జిల్లా స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌లను నిర్వహించాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయడం, ఈ అంశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాధాన్యతను చాటుతోంది. ప్రస్తుతం తెలంగాణ విపత్తు నిర్వహణ సంస్థ సరికొత్త డేటా ఆధారిత రియల్ టైమ్ వ్యవస్థలను రూపొందిస్తోంది. ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించే హజార్డ్ మ్యాపింగ్, ప్రజల మొబైల్ ఫోన్లకు తక్షణ హెచ్చరిక సందేశాలు పంపడం, మరియు సహాయక బృందాల కదలికలను జీపీఎస్ ద్వారా పర్యవేక్షించడం ఇందులో భాగం. ఇతర అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలను పరిశీలిస్తూ, మన భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా వాటిని మార్చుకుంటున్నారు. విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కంటే, ముందే ప్రమాదాన్ని అంచనా వేసి నివారించడమే ఈ కొత్త విధానం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ ఆధునిక మార్పుల వల్ల అత్యవసర సమయాల్లో ప్రభుత్వ స్పందన కాలం గణనీయంగా తగ్గుతుంది. ఫలితంగా నగరాలు, వరద ప్రభావిత ప్రాంతాలు మరియు జనసాంద్రత ఎక్కువగా ఉన్న చోట్ల ప్రాణనష్టం జరిగే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ వినూత్న చర్యలు రాష్ట్రాన్ని విపత్తు నిర్వహణలో మరింత ఆధునిక, అప్రమత్త, మరియు ప్రజాకేంద్రీకృత సురక్షిత రాష్ట్రంగా నిలబెడుతున్నాయి.

# పరాభవ నామ సంవత్సరంలో అధిక మాసం అంటే ఏమిటి?

## అధిక జ్యేష్ఠం ప్రత్యేకత ఏంటి

(పుట్టా శ్రీనివాసరావు)

**ఒకొక్కసారి అధిక మాసాలు వస్తుంటాయి.అవి ఎందుకు వస్తాయ్ అన్నది చాలా మందికి తెలీదు.ఈ నేపధ్యంలో ప్రస్తుతం మనం అధిక మాసం లో ప్రవేశించాం కాబట్టి దాని గురించి ప్రముఖ జ్యోతిష్య ప్రవీణ సర్వేష్ కోరుకొండ మాటల్లో తెలుసుకుందాం..సాధారణంగా చాంద్రమానం (చంద్రుడి గమనం) ప్రకారం ఒక ఏడాదికి 354 రోజులు ఉంటాయి.కానీ సూర్యుడి గమనం (సౌరమానం) ప్రకారం ఏడాదికి 365 రోజులు ఉంటాయి. ఈ రెండింటి మధ్య ఉన్న 11 రోజుల వ్యత్యాసం మూడు ఏళ్లకు కలిపితే సుమారు ఒక నెల (33 రోజులు) అవుతుంది. ఈ తేడాను సరిచేయడానికి ప్రతి 32 నెలలకు ఒకసారి పంచాంగంలో ఒక అదనపు నెలను చేరుస్తారు. దాన్నే 'అధిక మాసం' అంటారు.**



ఏ మాసంలో అయితే సూర్యుడు ఒక రాశి నుండి మరొక రాశిలోకి ప్రవేశించడో (సూర్య సంక్రాంతి లేని మాసం), ఆ నెలను అధిక మాసంగా పరిగణిస్తారు.

దీనిని 'పురుషోత్తమ మాసం' అని కూడా పిలుస్తారు. ఈ సమయంలో శుభకార్యాల కంటే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తారు.

### అధిక జ్యేష్ఠ మాసం ఎప్పుడు వస్తుంది?

ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం, రాబోయే అధిక జ్యేష్ఠ మాసం 2026 సంవత్సరంలో వస్తుంది.

2026లో జ్యేష్ఠ మాసం రెండుసార్లు వస్తుంది. మొదటిది అధిక జ్యేష్ఠం, రెండవది నిజ జ్యేష్ఠం. సంప్రదాయం ప్రకారం అధిక మాసంలో నిత్య పూజలు చేయవచ్చు కానీ, వివాహాది శుభకార్యాలను సాధారణంగా నిజ మాసంలోనే నిర్వహిస్తారు. తెలుగు పంచాంగం చంద్రుడి గమనం మీద ఆధారపడుతుంది (చాంద్రమాన రీత్యా). అందుకే ప్రతి 2-3 ఏళ్లకు ఒకసారి 13వ నెల వస్తుంది. దీన్నే అధిక మాసం, మల మాసం, పురుషోత్తమ మాసం అంటారు.

### ఎందుకు వస్తుంది?

సౌర సంవత్సరం = 365 రోజులు 6 గంటలు

చాంద్ర సంవత్సరం = 354 రోజులు

ఏడాదికి దాదాపు 11 రోజులు తేడా వస్తుంది. ఈ తేడా పేరుకుపోయి 2.7 ఏళ్లకు (≈32.5 నెలలకు) ఒక పూర్తి నెల అవుతుంది. అప్పుడు చంద్ర, సూర్య క్యాలెండర్లను సమన్వయం చేయడానికి ఒక నెలను అదనంగా కలుపుతారు.

ఇది చాంద్రమానం పాటించే వారికే వర్తిస్తుంది; సౌరమానం (కేరళ, తమిళనాడు లాంటి చోట్ల) పాటించేవారికి అధిక మాసం ఉండదు.

### 2026 లో అధిక మాసం



2026లో వచ్చేది అధిక జ్యేష్ఠ మాసం:

ఈ నెల శ్రీకృష్ణునికి అంకితం, అందుకే పురుషోత్తమ మాసం అని పిలుస్తారు.

జ్యోతిష్యంలో ఏమి చేయాలి, ఏమి చేయకూడదు?

చేయకూడనివి (మల మాసం కారణంగా):

పెళ్లిళ్లు, గృహప్రవేశం, ఉపనయనం లాంటి శుభ కార్యాలు సాధారణంగా వాయిదా వేస్తారు.

చేయదగినవి:

దీపావళి, దసరా లాంటి పెద్ద పండుగలు ఈ నెలలో రావు, కానీ ఇది పూర్తిగా ఆధ్యాత్మిక సాధనకు మంచిది.

అధిక మాస వ్రతం, జపం, ప్రదక్షిణలు, పారాయణం, దానధర్మాలు, తిరుపతిలో రెండు బ్రహ్మోత్సవాలు లాంటి విశేష పూజలు చేస్తారు.

సారాంశం: చంద్రుడి 29.5 రోజుల నెలను సూర్యుడి ఋతువులతో కలపడానికి ప్రకృతి ఇచ్చిన "లీప్ మంత్" ఇది. తెలుగు వారికి ఇది పుణ్యం సంపాదించే నెల, కానీ లౌకిక శుభకార్యాలకు కాదు.2026లో కొత్త తెలుగు పంచాంగం మార్చి 30న ప్రారంభం కానుంది. ఈ సంవత్సరాన్ని పరాభవ నామ సంవత్సరంగా వ్యవహరిస్తారు. చైత్రం, వైశాఖం తర్వాత వచ్చే మూడవ నెల జ్యేష్ఠ మాసం కావడం విశేషం. ఈసారి అధిక మాసంగా ఇదే నెల.గతంలో అధిక ఆషాఢం, అధిక శ్రావణం వంటి మాసాలు వచ్చాయి. అధిక జ్యేష్ఠ మాసం మే 17, 2026 నుంచి జూన్ 15, 2026 వరకూ.. నిజ జ్యేష్ఠ మాసం జూన్ 16, 2026 -- జూలై 14, 2026 వరకూ ఉంటుంది.

# క్రియేటివిటీనా... వల్గారిటీనా?

## వ్యూస్, ఫాలోవర్స్ కోసం విలువలను తాకట్టు పెడుతున్న 'డిజిటల్' సంస్కృతి!

ఒకప్పుడు సమాజంలో మంచి గుర్తింపు రావాలంటే ఎంతో ప్రతిభ ఉండాలి, కష్టపడే తత్వం ఉండాలి. అందరితో మెప్పు పొందాలంటే ఎన్నో ఏళ్ల సాధన అవసరమయ్యేది. కానీ, ఇప్పుడు చేతిలో ఒక స్మార్ట్‌ఫోన్, ముందొక కెమెరా, ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటే చాలు... ఎవరైనా రాత్రికి రాత్రే "స్టార్" అయిపోతున్నారు.

నిజానికి టెక్నాలజీ అనేది మనిషి ఎదుగుదలకు, కొత్త విషయాలు నేర్చుకోవడానికి వచ్చింది. కానీ, దురదృష్టవశాత్తూ అదే టెక్నాలజీ నేడు కొందరి చేతుల్లో సమాజ విలువలను పాడుచేసే ఆయుధంగా మారింది. "కంటెంట్" అనే పేరుతో అసభ్యతను, అశ్లీలతను సోషల్ మీడియాలో పెట్టి కొందరు వ్యాపారం చేస్తున్నారు. వ్యూస్ కోసం, లైక్స్ కోసం, ఫాలోవర్స్ కోసం తమ వ్యక్తిత్వాన్ని డిజిటల్ వేలం వేస్తున్నారు. ఇది కేవలం ఫోన్లకు పరిమితమైన ట్రెండ్ కాదు... సమాజాన్ని లోపలి నుంచి పాడుచేస్తున్న ఒక ప్రమాదకరమైన పరిస్థితి.

### అశ్లీలతకు క్రియేటివిటీ అనే ముసుగు

"ఇది నా ఇష్టం", "ఇది మోడర్న్ కల్చర్", "ఇది ఒక ఆర్ట్" అంటూ కొందరు అసభ్యతను చాలా సులువుగా వెనకేసుకొస్తున్నారు. అశ్లీల డ్యాన్సులు, డబుల్ మీనింగ్ డైలాగులు, వ్యక్తిగత జీవితాన్ని పబ్లిక్ ప్రదర్శనగా మార్చడం... ఇవన్నీ ఇప్పుడు "కంటెంట్ క్రియేషన్" పేరుతో ట్రెండ్ అవుతున్నాయి. ఒంటిని ప్రదర్శిస్తే వ్యూస్ వస్తాయని, వివాదాస్పదంగా మాట్లాడితే ఫాలోవర్స్ పెరుగుతారని తెలిసిన తర్వాత... కొందరు తమ ప్రతిభను కాకుండా, విలువలను పక్కన పెట్టేస్తున్నారు. జనం బలహీనతలే వీళ్ల వ్యాపారానికి పెట్టుబడి. ఒక అసభ్య వీడియోకు లక్షల వ్యూస్ రాగానే, అది ఎంత దిగజారుడు కంటెంట్ అయినా, సమాజం "లైక్" కొట్టి దాన్ని సక్సెస్ అంటోంది. ఒక తప్పుడు విషయానికి వ్యూస్ వస్తే అది ట్రెండ్ అవుతుంది... ఆ ట్రెండే మెల్లగా మన సంస్కృతిగా మారిపోతుంది. ఇదే అసలైన ప్రమాదం.

### డిజిటల్ నేరస్థులు ఎవరు? చేసేవారా... చూసేవారా?

అసభ్య కంటెంట్ చేసేవాళ్లను తిట్టడం చాలా తేలిక. కానీ వాళ్లను కోట్ల మందికి చేరువ చేస్తోంది ఎవరు? మనమే. మన ప్రతి "లైక్", ప్రతి "షేర్", ప్రతి "వ్యూ"... వాళ్ల వ్యాపారానికి మరింత బలాన్ని ఇస్తున్నాయి. మార్కెట్‌లో డిమాండ్ లేకపోతే సప్లై ఉండదు. చూసేవాళ్లు లేకపోతే, చేసేవాళ్లకు అంత ధైర్యం రాదు. కాబట్టి, ఈ డిజిటల్ కాలుష్యంలో కంటెంట్ చేసేవాళ్లే కాదు... దాన్ని ఆగి చూసే ప్రతి వ్యూయర్ కీ బాధ్యత ఉంది. నేడు సోషల్ మీడియా వేదికలు కేవలం వినోదం కోసం మిగలలేదు. కోపం, కామం, సంచలనం,



గొడవలు... ఇవే ఇప్పుడు ఎక్కువ వ్యూస్ తెచ్చే వస్తువులుగా మారిపోయాయి.

### యువత మనసుల్లో 'డిజిటల్ స్లో పాయిజన్'

యువతరం ఎంతో సున్నితమైన వయసులో ఉంటుంది. వారు దేన్ని ఎక్కువగా చూస్తే దాన్నే త్వరగా ఫాలో అవుతారు. రోజుకు గంటల తరబడి రీల్స్, షార్ట్స్ చూస్తున్న నేటి యువతలో జీవితం పట్ల అవగాహన మారిపోతోంది. ప్రేమ అంటే బాధ్యత కాదు... కేవలం ఆకర్షణ మాత్రమే అనే భ్రమలో బతుకుతున్నారు. సక్సెస్ అంటే కష్టపడి పైకి రావడం కాదు... షార్ట్‌కట్‌లో శరీరాన్ని ప్రదర్శించి లేదా వివాదాలు సృష్టించి సులభంగా డబ్బు సంపాదించడమే అనే తప్పుడు ఆలోచనలు పెరుగుతున్నాయి. దీనివల్ల మహిళల పట్ల గౌరవం తగ్గుతోంది, బంధాల విలువ తెలియడం లేదు. ఈ రీల్స్ వ్యసనం వల్ల యువతలో ఓర్పు, ఆలోచనా శక్తి తగ్గిపోతున్నాయి. ఇది వినోదం కాదు... రేపటి తరం భవిష్యత్తుపై జరుగుతున్న మౌన దాడి.

### స్క్రీన్ వెనక మాయాజాలం: నీ బలహీనతే వారి వ్యాపారం

సోషల్ మీడియా కంపెనీల అసలు లక్ష్యం మనకు వినోదం ఇవ్వడం కాదు... మనల్ని ఎక్కువసేపు ఫోన్ స్క్రీన్‌కు బానిసలుగా మార్చడం. మనం ఏ వీడియో దగ్గర ఎక్కువసేపు ఆగామో, ఏ అసభ్యత వైపు ఆకర్షితులమయ్యామో... వెనుక ఉన్న 'అల్గోరిథం' అంతా గమనిస్తుంది. ఆ తర్వాత అలాంటి కంటెంట్‌నే వరుసగా మన ముందుకు నెడుతుంది. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన నిజం ఏమిటంటే... సోషల్ మీడియాలో మనం కస్టమర్ కాదు... మన సమయం, మన మనసు, మన బలహీనతలే అక్కడ అమ్ముడవుతున్న అసలు ప్రొడక్ట్.

మత్తు పదార్థాలు మాత్రమే మనిషిని బానిస చేసేవి అనుకుంటాం .. ఇప్పుడు డిజిటల్ కంటెంట్ అదే పని చేస్తోంది.

### స్వేచ్ఛ పేరుతో సామాజిక విధ్వంసం

నా అకౌంట్... నా ఇష్టం" అనే మాటకు కూడా కొన్ని హద్దులు ఉండాలి. వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో సమాజ మానసిక ఆరోగ్యాన్ని పాడుచేయడానికి ఎవరికీ హక్కు లేదు.

మన కంటెంట్ వల్ల లక్షలాది చిన్నపిల్లల ఆలోచనలు పాడవుతుంటే, యువత తప్పుదోవ పడుతుంటే... అది స్వేచ్ఛ కాదు, బాధ్యతారాహిత్యం. కళ అనేది సమాజాన్ని ఆలోచింపజేయాలి, మనిషిని మార్చాలి. కానీ అశ్లీలతను "ఆర్ట్" అని చెప్పడం... సంస్కృతిని చంపేయడమే. సమాజానికి హాని కలగకుండా మన భావాలను వ్యక్తపరచడమే నిజమైన స్వేచ్ఛ.

పరిష్కారం ఎక్కడ? మారాల్సింది ఎవరు? ఇన్ఫ్లుయెన్సర్లు: రెండు నిమిషాల ఫేమ్ కోసం జీవితకాల గౌరవాన్ని కోల్పోవద్దు. డబ్బు ఈరోజు వస్తుంది, రేపు పోతుంది. కానీ వ్యక్తిత్వం పోతే తిరిగి రాదు. సమాజాన్ని ప్రభావితం చేసే స్థాయికి వచ్చినప్పుడు బాధ్యతగా నడుచుకోవాలి.

యువత: ఎంతమంది మిమ్మల్ని ఫాలో అవుతున్నారన్నది కాదు... మీరు ఎలాంటి విలువలను ఫాలో అవుతున్నారన్నదే ముఖ్యం. వైరల్ కావడం గొప్ప కాదు... సమాజంలో విలువైన వ్యక్తిగా నిలవడం గొప్పది.

తల్లిదండ్రులు : పిల్లలకు స్మార్ట్‌ఫోన్ కొనిపెట్టడంతో బాధ్యత తీరిపోలేదు. వారు ఫోన్లలో ఏం చూస్తున్నారు? ఎవరిని ఫాలో అవుతున్నారు? అనే విషయాలపై కన్నేసి ఉంచాలి. ఈ కాలంలో "డిజిటల్ పేరెంటింగ్" చాలా అవసరం.

ప్రభుత్వం ఁ చట్టాలు: అశ్లీల కంటెంట్, డబుల్ మీనింగ్ రీల్స్ ద్వారా యువతను తప్పుదోవ పట్టించే వారిపై సైబర్ చట్టాల ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాలను మరింత బలోపేతం చేయాలి.

సమాజం: మనమే అసభ్యతను చూడటం, ప్రోత్సహించడం మానేస్తే... దానికి డిమాండ్ దానంతట అదే తగ్గిపోతుంది.

మంచి ఆలోచనలను, సమాజానికి ఉపయోగపడే కంటెంట్‌ను మాత్రమే మన 'లైక్' ద్వారా సపోర్ట్ చేయాలి.

ఒక దేశాన్ని నాశనం చేయడానికి యుద్ధాలు అవసరం లేదు. ఆ దేశ యువత ఆలోచనలను, నైతికతను నాశనం చేస్తే చాలు... ఆ దేశ భవిష్యత్తు తనంతట అదే కూలిపోతుంది.

నేడు మనం చూస్తున్న ఈ డిజిటల్ అశ్లీల సంస్కృతి... కేవలం ఫోన్ స్క్రీన్‌కు పరిమితమైన తాత్కాలిక సమస్య కాదు. ఇది సమాజపు నైతిక పునాదులను లోపల నుంచే తవ్వేస్తున్న ఒక నిశ్శబ్ద విపత్తు! వ్యూస్ కోసం విచక్షణను, లైక్స్ కోసం లజ్జను, ఫాలోవర్స్ కోసం భవిష్యత్తును తాకట్టు పెడుతూ పోతే... రేపు మనం చూసేది ప్రగతి పథంలో నడిచే "డిజిటల్ ఇండియా" కాదు, విలువలు పూర్తిగా శూన్యమైన ఒక రోగగ్రస్త సమాజం.

స్మార్ట్‌ఫోన్ అనే శక్తివంతమైన సాధనం ఇప్పుడు మన చేతిలోనే ఉంది. దాన్ని సంస్కృతిని కూల్చే ఆయుధంగా వాడుకుందామా? లేక రేపటి తరాన్ని తీర్చిదిద్దే సంస్కారంగా మార్చుకుందామా? తేల్చుకోవాల్సింది మనమే. ఎందుకంటే... మనకు కావలసింది క్షణకాలం ట్రెండ్ అయ్యే అసభ్యత కాదు, తరతరాలు గర్వపడే ఉజ్వల భవిష్యత్తు!



**జి. అజయ్ కుమార్**

# ప్రయాణికులకు శక్తి టీమ్ హెచ్చరికలు.. అపరిచితులతో జాగ్రత్త...

## శక్తి టీం ఏఎస్ఐ గంగాధర్..

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**



తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ గఆదేశాల మేరకు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, పర్యవేక్షణలో, నిడదవోలు సీఐ తిలక్ ఆధ్వర్యంలో మంగళవారం నిడదవోలు బస్ స్టాండ్ వద్ద శక్తి టీమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొవ్వూరు జోన్ నిడదవోలు సర్కిల్ శక్తి టీమ్ ఏఎస్ఐ గంగాధర్, డబ్ల్యూపీసీ శాంతి, నిడదవోలు ఎస్ఐ-1 జగన్మోహన్, ఎస్ఐ-2 జయరాజు తదితర పోలీసు సిబ్బంది పాల్గొని సుమారు 40 మంది ప్రయాణికులకు పలు భద్రతా సూచనలు చేశారు.ప్రజలు ప్రయాణాల సమయంలో అపరిచిత వ్యక్తులతో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, తెలియని వ్యక్తులు ఇచ్చే ఆహారం, పానీయాలు స్వీకరించవద్దని సూచించారు. మహిళలు మరియు వృద్ధులు ముఖ్యంగా బంగారు ఆభరణాలను బయట ప్రదర్శించకుండా భద్రంగా ఉంచుకోవాలని తెలిపారు. బంగారు నగలను బ్యాగుల్లో పెట్టుకొని నిర్లక్ష్యంగా ప్రయాణించడం వల్ల దొంగతనాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.అలాగే రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేశారు. బ్యాంకు ఓటీపీలు, ఏటీఎం వివరాలు, వ్యక్తిగత సమాచారం ఎవరికీ చెప్పవద్దని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులు, మెసేజ్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని వివరించారు.మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన "శక్తి యాప్" ఉపయోగాలను వివరించి, అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు. మహిళలు, విద్యార్థినులు తప్పనిసరిగా శక్తి యాప్‌ను మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.ఇక వేసవి కాలంలో ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే వారు "ఎల్‌హెచ్ఎంఎస్" (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) సదుపాయాన్ని వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. ఈ విధానం ద్వారా పోలీసులకు ముందస్తు సమాచారం అందించి ఇళ్ల భద్రతను మెరుగుపరచుకోవచ్చని తెలిపారు.చిన్నారుల భద్రత, మహిళలపై వేధింపుల నివారణ, అత్యవసర సమయాల్లో పోలీసులను ఎలా సంప్రదించాలి వంటి అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి బస్ స్టాండ్‌లో ఉన్న ప్రయాణికులు, మహిళలు మంచి స్పందన తెలిపి పోలీసుల చర్యలను అభినందించారు.



## ఉపాధి కోల్పోయాం ఆదుకోండి

### స్వర్ణకారుల ఆవేదన

**మాడుగుల మే 19 జయ జయహే**

ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో ఒక ఏడాది పాటు ఎవరు బంగారం కొనుగోలు చేయవద్దని ప్రధాని మోదీ పిలుపుతో తాము ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుకోవాలని స్వర్ణకారులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర స్వర్ణకారుల సంఘం పిలుపుమేరకు మంగళవారం మాడుగుల శ్రీ మోదకామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో బందు పాటించిన స్వర్ణకారులు శతకం పట్టు నుంచి తాహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసిల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. తమ సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమి సహకరశీ అందించడం లేదని వారు తెలిపారు. ఈ నేపద్యంలో ప్రభుత్వాలు తమకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోశ్రీ మోదకామాక్షి స్వర్ణకార సంఘం అధ్యక్షులు పెదపల్లి రామచంద్రరావు, ఉపాధ్యక్షులు శీలామంతుల వాసు, శెక్రటరి బెన్నాబతుల ప్రసాద్, కోశాధికారి నవర బ్రహ్మ జీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## అమ్మ జాతరలో ప్రసాదం మజ్జిగ పంపిణీ చేసిన వాసవి క్లబ్స్

**పాడేరు మే 19 జయ జయ హే**

గిరిజన ప్రాంత ఆరోగ్య దేవత శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర నేపథ్యంలో మంగళవారం పాడేరులో వాసవి క్లబ్ పాడేరు హిల్స్ , వనిత మొదమంబ వారి ఆధ్వర్యంలో పండగకు విచ్చేసిన భక్తులకు ఉచితంగా మజ్జిగ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ప్రతి ఆడది అమ్మ జాతరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఐఏసి అధికారి ఆఫీసర్ శ్రీనాథ్. శ్రీను,ఎస్ లిఖిత్, చరణ్, రాజా, చినరాజు వనితలు పాల్గొన్నారు.



## ప్రపంచ యోగాసన పోటీల్లో చోడవరం విద్యార్థిని ప్రతిభ

**చోడవరం మే 19 జయ జయహే**

చోడవరం పతంజలి యోగ శిక్షణ కేంద్రం యోగా గురువు పుల్లేటి సతీష్ వద్ద యోగ విద్యను అభ్యసిస్తున్న ముత్యాలు దైవజ్ఞ ఈ నెల 16 నుండి 19వ వరకు మలేషియా రాజధాని కౌలాలంపూర్ లో జరిగిన 11వ ప్రపంచ యోగ ఆసన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. మన దేశం తరపున 6 నుండి 10 ఏళ్ల బాలికల విభాగంలో యోగ నిద్ర ఆసనం, కుక్కుటా ఆసనం, టిట్టిబా ఆసనం, గండభేరుండ ఆసనం వంటి కష్టతరమైన ఆసనాలు చేసి రెండో స్థానం సాధించి మన దేశానికి మన రాష్ట్రానికి చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రానికి అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందని యోగ గురువు పుల్లేటి సతీష్ తెలిపారు.అలాగే ముత్యాల దైవజ్ఞ ను తల్లిదండ్రులు డాక్టర్ నవీన్ కుమార్ రమ్య యోగ శిక్షణ కేంద్రం చైర్మన్ పసుమర్తి అశోక్, డాక్టర్ బంగారు కృష్ణ, రాయి సూర్యనారాయణ, రెడ్డి అప్పారావు,యోగా టీచర్స్ కొట్టాపు హరి కిరణ్, భోగవిల్లి గణేష్, బరినికాల మోహన్ కుమార్, పసుమర్తి గుప్తా, రవితేజ యోగా కేంద్ర సభ్యులు చోడవరం పెద్దలు ప్రముఖులు అభినందనలు తెలిపారు

## సంపద తయారీ కేంద్రాలు మరింత సమర్థవంతంగా నిర్వహించండి

**మాడుగుల మే 19 జయ జయహే**



మండలంలో గల అన్ని గ్రామాల్లో పంచాయతీలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంపద తయారీ కేంద్రాలు (ఎస్ డబ్ల్యూ పిసి) మరింత సమర్థవంతంగా నిర్వహించాలని స్థానిక ఎండిఓ కే అప్పారావు సూచించారు. మంగళవారం ఆయన మండలంలో గజ్జి అగ్రహారంలో ఎస్ డబ్ల్యూ పిసి షెడ్డును పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రస్తుతం నిత్యం ఎంత సంపద తయారవుతుందో దీనిపై ఎలాంటి దృష్టి సారిస్తున్నారు అనే వివరాలు తెలుసుకొని గ్రామంలో భద్ర సమర్థవంతంగా నిర్వహించాలని ఎక్కడ కూడా తడిచేత పొడిచేత లేకుండా చూడాలని సూచించారు. అలాగే గ్రామంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛ రదాన్ని కూడా ఆయన పరిశీలించి గ్రామస్తులు ఈ రథాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఇంట్లో ఉండే పనికిరాని ప్లాస్టిక్ సామాగ్రిని అందజేసి కావలసిన వస్తువులు తీసుకోవాలని కోరారు.

## దాడిలో గాయపడిన పాస్టర్‌ను పరామర్శించిన బొల్లవరపు జాన్ వెస్లీ

**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖపట్నం కింగ్ జార్జి హాస్పిటల్ లో మతోన్మాదుల చేతులలో చింతపల్లిలో జరిగిన దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న పాస్టర్ అభినయ్ దర్శన్ ని వైయస్సార్ కాంగ్రెస్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ పరామర్శించారు . దాడి జరిగిన వివరాలను పాస్టర్ అభినయ దర్శన్ ద్వారా తెలుసుకున్నారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ పాస్టర్ అభినయ దర్శన్ మీద జరిగిన దాడిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని తెలియజేశారు. ఇలాంటి సంఘటనలు జరగడం చాలా దురదృష్టకరమని తెలియజేశారు. ఇలాంటి సంఘటనలో మరల పునారావృతం కాకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలియజేశారు.ఈ ప్రజాస్వామ్య లౌకిక రాజ్యంలో ఏ మతం వారి మీద కూడా దాడి చేయకూడదని ఇది అత్యంత హేయమైన ఆటవిక చర్యని పేర్కొన్నారు. ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో క్రైస్తవుల మీద దాడులు అధికమయ్యాయని ప్రభుత్వం ఈ



విషయంలో క్రైస్తవులకు రక్షణ కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలియజేశారు . ఈ భారత దేశంలో మతానికి ఒక ప్రత్యేకత ఉందని, భారత దేశ సంస్కృతి మతాలతో ముడిపడి ఉన్నదని అందువలన అన్ని మతాలను గౌరవించాలని భారత రాజ్యాంగంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్టికల్ 25 నుండి ఆర్టికల్ 28 వరకు మత స్వేచ్ఛను దేశ ప్రజలకు అందించడం జరిగిందని, మత స్వేచ్ఛ మాత్రమే కాదు మతాన్ని ప్రచారం చేసుకునే వీలును కూడా వ్యక్తులకే కాదు వ్యవస్థలకు కూడా రాజ్యాంగం కల్పించి అందించిందని ఆ విషయాన్ని ఈ కూటమి పాలకులు విస్మరించి క్రైస్తవుల మీద, క్రైస్తవ వ్యవస్థల మీద ఈ కూటమి ప్రభుత్వం దాడి చేస్తుందని తెలియజేశారు. వీటన్నిటి వలన క్రైస్తవులలో ఒక అభద్రత భావం పెరిగి పోయిందని తెలియజేశారు. 2024 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో క్రైస్తవులు అందరూ కూటం ప్రభుత్వానికి నమ్మి ఓట్లు వేసినందుకు క్రైస్తవులందరూ ఈరోజు బాధపడే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలియజేశారు. రాబోయే రోజుల్లో ఎప్పుడు ఎలక్షన్స్ జరిగిన క్రైస్తవులందరూ ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ప్రతి అన్వేష్ గాజువాక నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు మరియు పాడేరు నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ సెక్రెటరీ స్టీవెన్,జల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు



## యూఏఈ పెట్టుబడులతో బలపడుతున్న భారత ఆర్థిక వ్యవస్థ

**(సి.హెచ్.ప్రతాప్)**

పశ్చిమ ఆసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ప్రతి సందర్భంలో ప్రపంచ దేశాలు చమురు సరఫరాల భద్రతపై ఆందోళన చెందుతుంటాయి. ఇరాన్--ఇజ్రాయెల్ విభేదాలు మళ్లీ ముదురుతున్న తరుణంలో భారతదేశం తన ఇంధన అవసరాలను భద్రపరుచుకునేందుకు ముందడుగు వేసింది. ఈ నేపథ్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో భారత ప్రధాని జరిపిన చర్చలు దేశ దౌత్య వ్యూహానికి మరో కీలక విజయంగా నిలిచాయి. యూఏఈ అధ్యక్షుడితో జరిగిన సమావేశాల్లో కుదిరిన ఒప్పందాలు భారత ఇంధన భద్రత, మౌలిక వసతులు, ఆర్థిక రంగాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించే అవకాశాలను తెరిచాయి.

ఈ పర్యటనలో అత్యంత ప్రాధాన్యం పొందిన అంశం భారతదేశంలో వ్యూహాత్మక ముడి చమురు నిల్వ కేంద్రాల ఏర్పాటు. యూఏఈ భారత్‌లో 30 మిలియన్ బారెళ్ల ముడి చమురును నిల్వ చేయడానికి అంగీకరించడం సాధారణ వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదు; సంక్షోభ సమయాల్లో దేశానికి రక్షణ కవచంగా నిలిచే నిర్ణయం. ప్రపంచ మార్కెట్లలో సరఫరా అంతరాయం ఏర్పడినా, దేశీయ అవసరాలను తీరుస్తూ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకు ఈ నిల్వలు తోడ్పడతాయి. ప్రస్తుతం భారతదేశం వినియోగిస్తున్న ముడి చమురులో గణనీయమైన భాగం యూఏఈ నుంచే దిగుమతి అవుతోంది. సహజ వాయువు అవసరాల్లోనూ ఆ దేశం కీలక భాగస్వామిగా ఉంది. ఈ నేపథ్యంలో వ్యూహాత్మక నిల్వల ఏర్పాటు, దీర్ఘకాలిక ఎల్‌పీజీ సరఫరా ఒప్పందాలు, భవిష్యత్తులో గ్యాస్ నిల్వ కేంద్రాల నిర్మాణంపై పరస్పర అవగాహన దేశ ఇంధన రంగానికి కొత్త భరోసాను కలిగిస్తున్నాయి.ఇదే సమయంలో యూఏఈ ప్రకటించిన 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు భారత ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వనున్నాయి. మౌలిక వసతులు, బ్యాంకింగ్, గృహ నిర్మాణ ఆర్థిక రంగాల్లో ఈ పెట్టుబడులు కేంద్రీకృతం కావడం విశేషం. అబుదాబి పెట్టుబడి సంస్థలు భారత మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం ద్వారా రహదారులు, నౌకాశ్రయాలు, పారిశ్రామిక కేంద్రాల విస్తరణకు ఊతం లభించే అవకాశం ఉంది. అదే విధంగా బ్యాంకింగ్ రంగంలో భారీ పెట్టుబడులు దేశీయ ఆర్థిక కార్యకలాపాలకు ద్రవ్యతను పెంచనున్నాయి.ఈ పర్యటన కేవలం ఆర్థిక ఒప్పందాలకే పరిమితం కాలేదు. రక్షణ రంగంలో కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం భారత్--యూఏఈ సంబంధాలను మరింత బలోపేతం చేసింది. సైబర్ భద్రత, సముద్ర రక్షణ, సైనిక శిక్షణ వంటి రంగాల్లో పరస్పర సహకారం పెరగనుంది. గుజరాత్‌లో భారీ నౌక మరమ్మత్తు కేంద్రం ఏర్పాటుకు కుదిరిన అవగాహన సముద్ర వాణిజ్యానికి కొత్త దిశను చూపించనుంది. ప్రపంచ రాజకీయ అనిశ్చితి మధ్య భారత్ తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు దౌత్యాన్ని ఎంత సమర్థంగా వినియోగించుకుంటోందో ఈ పరిణామాలు స్పష్టంచేస్తున్నాయి. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహం, భారత్‌ను క్రమంగా గ్లోబల్ ఆర్థిక--రాజకీయ వేదికపై మరింత ప్రభావవంతమైన శక్తిగా నిలబెడుతోంది.



## నూకాలమ్మ అమ్మవారి ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం

**భీమిలి, మే 19: (జయ జయహే)**

భీమిలి నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించారు. విశాఖలో సింహాచలం, కనక మహాలక్ష్మి అమ్మవారి తర్వాత అంతటి ప్రాముఖ్యం గల భీమిలి నూకాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. చురకల రమణ, బర్రి రాజు, కుప్పిలి దుర్గ, రామాయణం రాజ్యలక్ష్మి, గుసివాడ ప్రవల్లిక, గరికిన సత్యం, నక్కెళ్ళ వెంకటేశ్వరరావు, దౌలుపల్లి త్రినాథరావులను సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం, వారి అభిప్రాయం తీసుకుని చురకల రమణను చైర్మన్ గా సభా ముఖంగా గంటా ప్రకటించారు. అంతకు ముందు గంటా నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల సందీప్, కురుమిన రామస్వామి నాయుడు, కైలాష్ రెడ్డి, కె. రామానాయుడు, గాడు వెంకటప్పదు, చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, కనకల అప్పలనాయుడు, సరగడ అప్పారావు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, కొప్పల రమేష్, దండి వెంకటేష్, శాఖారి శ్రీనివాస్, వై.అనిల్ ప్రసాద్, గరే గుర్నాథ్, బోని ప్రసాద్, పీవీ నరసింహం, కాకర రమణ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి కలిసిన కె.కె రాజు

**విజయవాడ (జయ జయహే)**



లండన్ పర్యటన అనంతరం విజయవాడకు తిరిగి వచ్చిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి ని తాడేపల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం మరియు పార్టీ కమిటీలు నిర్మాణం, ఐడి కార్డుల వెరిఫికేషన్ గురించి చర్చించారు.

For a pure tomorrow.. జయహో

# ఎన్టీఆర్ వస్తేనే తెలుగు దేశం పార్టీకి మళ్లీ భవిష్యత్తు

## నారా లోకేష్ కి మించిన జనాదరణ ఎన్టీఆర్ కి ఉంది

## తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ కీలక వ్యాఖ్యలు



**విశాఖపట్నం : (జయ జయహే)**

తెలుగు దేశం పార్టీ 2029 లో కూడా మళ్లీ అధికారంలోకి రావాలంటే పార్టీకి జూనియర్ ఎన్టీఆర్ అవసరం తప్పనిసరి అని .. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ వ్యాఖ్యానించారు. ఈనెల 20వ తేదీన ఎన్టీఆర్ జన్మదినం నేపథ్యంలో బి.వి.రామ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మంగళవారం ఉదయం డాబాగార్డెన్స్ లోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం అన్న నందమూరి తారక రామారావు తెలుగు దేశం పార్టీని స్థాపించారన్నారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పని చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. ఇదే క్రమంలో ఆయన కుమార్తె పురందరేశ్వరి, నందమూరి హరికృష్ణ తండ్రి వారసత్వాన్ని అనుసరించగలిగారన్నారు. అయితే పురందరేశ్వరి ప్రస్తుతం భారతీయ జనతా పార్టీలో కొనసాగుతుండగా.. హరికృష్ణ దురదృష్టవశాత్తు, ఈ లోకం నుంచి దూరమయ్యారని ప్రస్తావించారు. నందమూరి బాలకృష్ణ తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నప్పటికీ తండ్రి మార్కును ఆయన సొంతం చేసుకోలేకపోయారన్నారు. ఈ పరిస్థితులలో యువతరం నాయకులు తెర పైకి రావాల్సిన అవసరం ఉందని రామ్ ప్రస్తావించారు. ఇటు మన రాష్ట్రంలో లోకేష్, పవన్ కళ్యాణ్, పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ ఇదే కోవలోకి వస్తారన్నారు.

### ఎన్టీఆర్ వారసుడు ఎవరు ?

అయితే నాటి ఎన్టీఆర్ వారసుడు ఎవరు అనే ప్రస్తావనకు వచ్చేసరికి ప్రశ్నార్ధకం మాత్రమే కనిపిస్తుందన్నారు. ఈ పరిస్థితులలో నాటి నందమూరి తారక రామారావు పేరుతో పాటు అంతటి ప్రజాదరణ కలిగిన వ్యక్తి జూనియర్ ఎన్టీఆర్ అని తను భావిస్తున్నానన్నారు. తన అభిప్రాయంతో తెలుగు ప్రజలు కూడా ఏకీభవిస్తారని.. అత్యధిక శాతం మంది అభిప్రాయం కూడా ఇదే అవుతుందనే నమ్మకం తనకు ఉందన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎందుకంటే నాడు నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగు దేశం పార్టీ 2029 లో కూడా మళ్లీ అధికారంలోకి రావాలంటే పార్టీకి జూనియర్ ఎన్టీఆర్ అవసరం తప్పనిసరి అని బి.వి.రామ్ వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో 2029 ఎన్నికలకు మరో మూడేళ్ల వ్యవధి ఉన్నప్పటికీ... ఇప్పటి నుంచే జూనియర్ ఎన్టీఆర్ ప్రత్యక్ష రాజకీయాల వైపు అడుగుల వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటి నుంచే ఆ ప్రయత్నం మొదలుపెడితే 2029 ఎన్నికల నాటికి తెలుగు దేశం పార్టీ ఆంధ్రప్రదేశ్లో అత్యంత బలమైన పార్టీగా అవతరిస్తుందన్నారు.



# చోడవరం నియోజకవర్గానికి అధిక పనులు మంజూరు చేయండి

**చోడవరం మే 19 జయ జయహే**

చోడవరం నియోజవర్గానికి అత్యధికంగా ఉపాధి హామీ పనులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎం ఎస్ రాజు కోరారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, దోమ పిడి తగు శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం చోడవరం మండలంలో గల 32 గ్రామ పంచాయతీ ల్లో జరిగిన 2024-25 సంవత్సర జాతీయ ఉపాధి హామీ పథకం వేతన పనులు మెటీరియల్ కన్వర్జెన్స్ పనులు సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో పబ్లిక్ హియరింగ్ ..పథక సంచాలకులు (పీడీ ) డ్వామా సిహెచ్ నిర్మలా దేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో కూలీల వలసలు నివారించేందుకు వారికి ఉపాధి కల్పించేందుకు తలపెట్టిన ఈ పథకాన్ని సద్వినియోగపరచడంతో పాటు అవసరం మేరకు చేపట్టాలని అవసరమైన చోట్ల నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ముఖ్యమైన పనులకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏం.పి.పి. గాడి కాసులమ్మ , అంబుడ్స్ మాన్ బి. వేణుగోపాల్ డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అధికారి డి.వి.ఎస్.ఎస్.ఎన్.వర్మ ఏ.పి.డి. జె.మణి కుమార్ ఎస్ఆర్పి సోషల్ ఆడిట్ సిహెచ్ రామచంద్ర రావు , స్పెషల్ ఆడిట్ డిఆర్పి లు , ఎంపీడీవో పి.వి.ఎన్. జె. ఆంజనేయులు ,ఏపీవో డి చంద్ర కళ, ఈసీ రామునాయుడు అందరు టెక్నికల్ అసిస్టెంట్ లు, ఫీల్డు అసిస్టెంట్ లు పాల్గొన్నారు.



# ముస్లిం బాలికకు కె 9కాపు సంక్షేమ సంస్థ చేయూత

**జంగారెడ్డిగూడెం :(జయ జయహే)**

*పుట్టుక తోనే అనారోగ్యం పాలై ఫీట్స్ తో బాధ పడుతున్న ఏడాది. వయస్సున్న పాపకు కాపు సంక్షేమ సంఘం కె 9ద్వారా మంగళవారం రూ 6వేలు ఆర్థిక సహాయం అందించినట్టు సంస్థ అధ్యక్ష,కార్యదర్శులు తొమ్మిదేళ్ల శ్రీనివాస్ రావు, శీలం కృష్ణం రాజు తెలిపారు.ఈ సందర్బంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ పాప తండ్రిఎస్ కె జహీర్ టైల్స్ పని జేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నట్టు తెలిపారు. వారి మొదటి సంతానం మైన పాపపుట్టుక తోనే ఫీట్స్ వ్యాధి తో బాధ పడుతున్న సంగతి కె 9 గౌరవాధ్యక్షుడు దాకారపు కృష్ణ కు తెలీటంతో ఆయన ప్రోత్సాహం తో కె 9 ద్వారా కుటుంబానికి రూ 5వేలు అలాగే కె9 ట్రెజరర్ మోహన్ మరో వెయ్యిఆర్థిక సాయం చేసినట్టు పేర్కొన్నారు. కార్యదర్శి శీలం కృష్ణం రాజు మాట్లాడు తూకుల మతాలకు అతీతంగా కె 9 సంస్థ అందరికీ కష్టం లో కాపు కాస్తున్న దని అన్నారు. కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ వల వల తాతాజీ కె 9ట్రెజరర్ పి మోహన్, మహిళా విభాగం అధ్యక్షురాలు పారేపల్లి నరేష్, సింగవరపు లక్ష్మి, సామాజిక విభాగం అధ్యక్షుడు గణిత ఆనంద ప్రసాద్, శీలం గోపి, కొణతాల రామకృష్ణ శీలం సతీష్ తదితరులు పాల్గొన్నారు.*



# మొదకొండమ్మ జాతర మహోత్సవంలో పాల్గొన్న పీవీజీ

**పాడేరు (జయ జయహే)**

ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ . మోద కొండమ్మ. అమ్మవారి. అనుపు. ఉత్సవ కార్యక్రమం ఏ ఎస్ ఆర్ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మరియు .ఎమ్మెల్యే విశ్వేశరరాజు, వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ .టీడీపీ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి తో పాటు. పాల్గొన్న రాష్ట్ర కొప్పుల వెలమ కార్పరేషన్ చైర్మన్. పీవీజీ కుమార్. దంపతులు ఈ సందర్బంగా మొదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సందర్బంగా పీవీజీ కుమార్ 10,000 రూపాయలు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కు అందచేసారు

# మాజీ సీఎం జగన్‌ను కలిసిన రొంగలి జగన్నాధం

**తాడేపల్లి (జయ జయహే)**

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన బొబ్బిలి నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాధం . ఈ సందర్భంగా విశాఖపట్నం మరియు బొబ్బిలి నియోజకవర్గాలలో పార్టీ బలోపేతం గురించి చర్చించారు





# సుందరయ్య ఆశయాలను సాధిద్దాం

## చోడవరంలో సుందరయ్య కు ఘన నివాళి

**చోడవరం మే 19 జయ జయహే**

దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమనేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం చోడవరంలో కొత్తూరు జంక్షన్ లోనూ సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సుందరయ్య చిత్రపటానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు వీవీ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, అంగన్వాడి యూనియన్ నాయకులు కొండమ్మ లు పూలమాలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో కార్మికులకు, రైతులకు, కూలీలకు సంఘాల్ని ఏర్పాటు చేయడంలోనూ, కమ్యూనిస్టు ఉద్యమాన్ని పతాక స్థాయిలోకి తీసుకొని వెళ్లడంలోనూ సుందరయ్య ఎనలేని కృషి చేశారన్నారు. నేటి సమకాలీన రాజకీయాలలో సుందరయ్య కంటే ఆదర్శవంతులు మరొకరు లేరని అన్నారు.పార్లమెంటుకు సైకిల్ పై వెళ్లి నిరూపించుకున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు ప్రసాద్ (దాస్), మండల నాయకులు ఎస్.వి నాయుడు, దేముళ్ళు, సంధ్య చంద్రశేఖర్, గోవింద్, చంద్రరావ్, ఉష తదితరులు పాల్గొన్నారు.



# మాడుగుల గ్రామ అభివృద్ధి దిశగా మరో అడుగు!

**మాడుగుల మే 19 జయ జయహే**

మాడుగుల శ్రీ మోదకొండమ్మ తల్లి గుడి వద్ద ఉన్న పాండవుల చెరువు పునరుద్ధరణ, ఆధునికీకరణ పనులు మంగళవారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. 50 లక్షల రూపాయలతో చేపట్టనున్న ఈ చెరువు ఆధునికరణ పనులకు ఇటీవల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే అహర్నిశ కృషి, పట్టుదల, ప్రజల పట్ల ఉన్న అంకితభావం వలన ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. ఈ ఆధునికరణ పనుల్లో భాగంగా చెరువులోవాకింగ్ ట్రాకు, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, బోటు షికారు, జిమ్ వంటివి నిర్మించనున్నారు. 60 రోజుల్లో పూర్తి కానున్న ఈ ప్రాజెక్టు పనులు పూర్తి కాగలవని , తద్వారా మాడుగుల గ్రామానికి ఒక కొత్త శోభను తీసుకురానుందనీ మాడుగుల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ చెప్పారు. ఇప్పటికే డిగ్రీ కాలేజ్ నిర్మాణం జరుగుతుందనీ, అన్నా క్యాంటీన్ ఏర్పాటు జరిగిందన్నారు. ఇప్పుడు పాండవుల చెరువు ప్రాజెక్టు కూడా రూపుదిద్దుకోవడం ద్వారా గ్రామం అభివృద్ధి మరింత వేగం అందుకుంటోందన్నారు. నియోజకవర్గ హెడ్‌క్వార్టర్స్ అయిన మాడుగుల గ్రామం, ఈ ప్రాజెక్టుల ద్వారా అభివృద్ధి వైపు దూసుకుపోతోందనీ, శాసనసభ్యుల విశేష కృషి ఫలితంగా మాడుగుల రూపురేఖలు మారబోతున్నాయనీ చెపుతూ.. గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# విశాఖ మత్స్యకారులకు రూ. 27.19 కోట్లు

## వేట నిషేధిత భృతి ద్వారా 13597మందికి లబ్ది

**విశాఖపట్నం మే 18, జయ జయహే**

మత్స్యకారుల వేట నిషేధిత భృతి కింద జిల్లాలో13,597 మందికి 27 కోట్ల రూపాయలు ప్రభుత్వం వారి ఖాతాలలో జమ చేసిందని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన మత్స్యకారుల సేవ కార్యక్రమంలో పాల్గొనగా జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ జి .విద్యాధరి, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ యాదవ్, కలెక్టరేట్ నుంచి వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేట నిషేధభృతి కింద మత్స్యకారులకు జిల్లాలో 27 కోట్ల 19 లక్షల 40 వేలు మెగా చెక్కును అందజేశారు.



అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే ప్రభుత్వం వేట నిషేధ భృతి కింద కుటుంబానికి 20వేల వంతున విడుదల చేసింది అన్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది 1500 మంది లబ్ధిదారులను చేర్చినట్లు ఆయన తెలిపారు. ఇంతకు ముందు మెకానైజ్డ్ బోట్లలో పనిచేసే సిబ్బంది 6గురికి మాత్రమే జీవన భృతి వర్తించగా ప్రస్తుతం 8 నుండి 10 మంది వరకు ఈ పథకంలో చేరుస్తున్నామన్నారు. ఇంకెవరైనా మిగిలి ఉంటే వారిని కూడా గుర్తించి ఈ పథకంలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు లక్ష్మణరావు, మత్స్యకార బోట్ల ఓనర్లు, మత్స్యకారులు పాల్గొన్నారు.



# కరివేపాకును తీసిపారేయకండి

## ప్రయోజనాలు తెలిస్తే షాక్ అవ్వడం ఖాయం

తీపి వేప అని ప్రసిద్ధి చెందిన కరివేపాకు భారతీయ వంటల్లో తప్పనిసరిగా చేర్చే పదార్థం. దీని ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే పిల్లలు, పెద్దలు అసలు వదిలి పెట్టారు. అయితే ఉదయాన్నే ఖాళీ కడుపుతో కరివేపాకు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం.

**కరివేపాకు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు:**

జీర్ణ వ్యవస్థకు మేలు: కరివేపాకులో ఉండే ఎంజైములు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. జీర్ణ సమస్యలు, అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలను తగ్గిస్తాయి.
రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: కరివేపాకులోని పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. దీని వల్ల మధుమేహం ఉన్నవారికి చాలా ఉపయోగకరం.
కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది: కరివేపాకులోని యాంటీ ఆక్సిడెంట్లు రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. ఇది గుండె ఆరోగ్యానికి మంచిది.
జుట్టు ఆరోగ్యానికి: కరివేపాకులో ఉండే పోషకాలు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. జుట్టు రాలడం, తెల్లటి జుట్టు వంటి సమస్యలను తగ్గిస్తాయి.
చర్మ ఆరోగ్యానికి: కరివేపాకులో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉండటం వల్ల చర్మ సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. ముఖ్యంగా మొటిమలు, మచ్చలు వంటి సమస్యలకు చాలా మంచిది.
రోగ నిరోధక శక్తిని పెంచుతుంది: కరివేపాకులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.
కాలేయం ఆరోగ్యానికి: కరివేపాకు కాలేయం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కాలేయం సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది.

**కరివేపాకును ఎలా తీసుకోవాలి?**

కరివేపాకు ఆరోగ్య ప్రయోజనాలతో నిండి ఉంది. దీన్ని రోజువారి ఆహారంలో భాగంగా చేర్చుకోవడం చాలా మంచిది. కరివేపాకును తీసుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయి:
పచ్చిగా: చాలా మంది కరివేపాకును పచ్చిగానే తీసుకుంటారు. దీన్ని చిన్న చిన్న ముక్కలుగా కోసి, సలాడ్‌లలో, చట్నీలలో లేదా కూరలలో వేసుకోవచ్చు.
పొడిగా: కరివేపాకును ఎండబెట్టి పొడి చేసుకోవచ్చు. ఈ పొడిని వంటలలో ఉపయోగించవచ్చు.
తైలం: కరివేపాకును నూనెలో వేసి వేడి చేయడం ద్వారా కరివేపాకు నూనె తయారు చేయవచ్చు. ఈ నూనెను తలకు రాసుకోవచ్చు లేదా వంటలలో వాడవచ్చు.
చట్నీ: కరివేపాకుతో రకరకాల చట్నీలు తయారు చేయవచ్చు. ఉదాహరణకు, కరివేపాకు, పచ్చిమిర్చి, కొబ్బరి చట్నీ.
పప్పు: కరివేపాకును పప్పులో వేసి వండుకోవచ్చు.
రసం: కరివేపాకు ఆకులను నీటిలో ఉడికించి ఆ రసాన్ని తాగవచ్చు.

# అట్టహాసంగా గిరిజన సంస్కృతిక కార్యక్రమాలు

## అలరించిన సినీ సంగీత గానాలు





**పాడేరు, మే 19, జయ జయహే**

శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం లో భాగంగా చివరి రోజు మంగళవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ప్రధాన వేదిక వద్ద వివిధ జిల్లాల నుండి వచ్చిన గిరిజన సాంస్కృతిక కార్యక్రమాల ఆహుతులను ఘనంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో ముందుగా పాడేరు, ఎ పి ఆర్ ఎస్ బాలికల పాఠశాల విద్యార్థినులచే క్లాసికల్ డాన్స్, స్వరగీతిక ఆర్కెస్ట్రా, చోంపి గ్రామం వారిచే అరకు దింసా నృత్యం, పార్వతీపురం జిల్లా వారిచే ఆగమ సవర నృత్యం, చిత్తూరు జిల్లా వారి కొమ్ముకోయ నృత్యం, సీతంపేట వారి సవర నృత్యం, కె. ఆర్. పురం వారి కొమ్ము కోయ నృత్యం ప్రజలను విశేషం గా ఆకట్టుకున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఫోటోగ్రఫీ విభాగం లో నిర్వహించిన పోటీలలో గోపినాయిక సురేష్ మొదటి బహుమతి, కొంట సుధాకర్ రెండవ బహుమతి గెలుపొందగా, మూడవ బహుమతి వినయ్ సుధాకర్ అందుకున్నారు. వీరికి నగదు బహుమతి తో పాటు, జ్ఞాపిక లను అందజేశారు. అలాగే పండగ సందర్భంగా వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్ కు జ్ఞాపకాలను అందజేశారు. మూడు రోజులపాటు అలరించిన కళాబృందాలకు జ్ఞాపకాలు ఇచ్చి సత్కరించారు. అమ్మవారి



పండగలో ఐదు మంది చిన్నారులు తప్పిపోయిన వారిని ఐసిడిఎస్ వారు ఏర్పాటు చేసిన ట్యాగుల వలన వారిని గుర్తించి వారి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని, ఆ శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే మూడు రోజులు పాటు అనుహితంగా కష్టపడి పనిచేసిన జిల్లా అధికారులకు, రెవిన్యూ, పోలీస్ యంత్రాంగానికి, రవాణా శాఖ అధికారులకు, విద్యుత్, అన్ని శాఖ అధికారులకు, సిబ్బందికి,మీడియాకు, పారిశుధ్య కార్మికులకు, ప్రజలకు ప్రజాప్రతినిధులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా అమ్మవారి ఆశీస్సులతో పండగ జయప్రదం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని జిల్లా యంత్రాంగం తరపున జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ అభినందనలు తెలియజేశారు.

# రూ.5 వేల కోట్లతో విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి

## వచ్చే మూడేళ్లలోనే అంటున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



**విశాఖపట్నం, మే 19, జయ జయహే**

రాబోయే 3 ఏళ్లలో 5 వేల కోట్ల రూపాయలతో విశాఖ ఎకనామిక రీజియన్ లో పలు అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు జిల్లా కలక్టరు యం.అభిషిక్త్ కిషోర్ వెల్లడించారు. మంగళవారం మత్స్యకారుల సేవలో కార్యక్రమం అనంతరం కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ సిటి ఎకనామిక్ రీజియన్ పేరున దేశంలో నాలుగు నగరాలను భారత ప్రభుత్వం ఎంపిక చేయగా దానిలో విశాఖపట్నం నగరానికి చోటు దక్కిందని ఆయన అన్నారు. నీతి అయోగ్ సూచనల మేరకు రీజియన్ లో 49 ప్రాజెక్టులతో పాటు స్థానిక అవసరాలకు అనుకూలంగా మరిన్ని ప్రాజెక్టులు చేపడతామన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఏర్పాటు వల్ల విశాఖ రీజియన్ లో అభివృద్ధి అవకాశాలు విస్తరిస్తున్న నేపథ్యంలో రుషికొండ, ఎండాడ తదితర ప్రాంతాలలో పోటేన్షియల్ పెరుగుతుందన్నారు. ఈ నిధులతో నగర ప్రజల ఆశయమును అనుగుణంగా విశాఖ సమగ్ర అభివృద్ధి దిశగా సాగుతుందని కలక్టర్ పేర్కొన్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ క్రింద జివిఎంసికి రూ. 200 కోట్లతో ఒక ప్రాజెక్టు, విఎంఆర్డిఎకు 100 కోట్లతో మరొక ప్రాజెక్టు మంజూరు కానున్నాయని అభిషిక్త్ కిషోర్ తెలిపారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ లు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు ఆయన వెల్లడించారు. సముద్ర తీర ప్రాంతంలో చాల చోట్ల రిటైనింగ్ వాల్స్ దెబ్బ తిన్నాయని వాటిని పునర్నిర్మాణం చేయడంతో పాటు ఋషికొండ వరకు రిటైనింగ్ వాల్స్ ఎక్కడ అవసరమో అక్కడ పలు రక్షనాత్మక నిర్మాణాలు చేపడతామని అన్నారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద జివిఎంసికి 3 ప్రాజెక్టుల కోసం రూ. 1500 కోట్లు నిధులు మంజూరైనట్లు కలక్టర్ విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

# ఉసిరికాయ తింటే అద్భుతమైన మార్పులు



**ఉసిరి అంటే తెలుగులో ఇండియన్ గూస్బెర్రీ అని పిలువబడే ఒక పండు. ఇది చిన్నగా, పుల్లగా, వగరుగా ఉంటుంది. ఆయుర్వేదంలో దీనిని అత్యంత ముఖ్యమైన ఔషధం గా భావిస్తారు. ఉసిరిలో విటమిన్ సి అధికంగా ఉండటంతో పాటు, ఇందులో యాంటీఆక్సిడెంట్లు, మినరల్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.**

**ఉసిరి ప్రయోజనాలు:**

రోగ నిరోధక శక్తిని పెంచుతుంది: ఉసిరిలో విటమిన్ సి పుష్కలంగా ఉండటం వల్ల ఇది రోగ నిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. తరచుగా జలుబు, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారు ఉసిరిని తీసుకోవడం వల్ల ఈ సమస్యలు తగ్గుతాయి.
జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది: ఉసిరిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది: ఉసిరిలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని స్వేచ్ఛా రాశుల నుంచి రక్షిస్తాయి. ఇది ముడతలు పడడాన్ని నిరోధిస్తుంది చర్మాన్ని మృదువుగా చేస్తుంది.
కంటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది: ఉసిరి కంటి చూపును మెరుగుపరుస్తుంది మొయ్య, గ్లాకోమా వంటి కంటి సమస్యలను నివారిస్తుంది.
తలముడిని బలపరుస్తుంది: ఉసిరి తలకు మర్దన చేయడం వల్ల తలలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది, తద్వారా జుట్టు రాలడం తగ్గుతుంది జుట్టు బలంగా పెరుగుతుంది.
ఊబకాయాన్ని తగ్గిస్తుంది: ఉసిరిలోని ఫైబర్ ఆకలిని తగ్గించి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది.
గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది: ఉసిరిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

**ఉసిరిని ఎలా ఉపయోగించవచ్చు:**

తినడం: ఉసిరిని శుభ్రం చేసి, గింజలను తీసివేసి తినవచ్చు.
జ్యూస్: ఉసిరిని నీరు, చక్కెర లేదా తేనె కలిపి జ్యూస్ చేసి తాగవచ్చు.
పొడి: ఉసిరిని ఎండబెట్టి, పొడి చేసి అనేక రకాల వంటలలో చేర్చవచ్చు.
చట్నీ: ఉసిరితో చట్నీ తయారు చేసి అన్నం, ఇడ్లీ, దోసతో తినవచ్చు.
అవల్: ఉసిరిని అవల్‌లో కలిపి తయారు చేసి తినవచ్చు.
పచ్చడి: ఉసిరితో పచ్చడి తయారు చేసి రోజువారి ఆహారంలో చేర్చవచ్చు.
పానీయాలు: ఉసిరిని ఉడికించి, చల్లార్చి, నీరు, తేనె కలిపి పానీయంగా తాగవచ్చు.
మరకలు తొలగించడానికి: ఉసిరి రసం తో ముఖం, చేతులపై ఉన్న మరకలను తొలగించవచ్చు.
జుట్టుకు: ఉసిరి పొడిని జుట్టుకు వేసి, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలను నివారించవచ్చు.

**ముఖ్యమైన విషయం:**

అధికంగా ఉసిరిని తీసుకోవడం వల్ల అజీర్తి, కడుపు నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నట్లయితే, ఉసిరిని తీసుకోవడానికి ముందు వైద్యుని సలహా తీసుకోవడం మంచిది.

# ఘనంగా ఆకాశవాణి వాకథాన్

### ఆకట్టుకున్న నినాదాలు

### 90 ఏళ్ల సంబరాలలో ఉద్యోగులు

**విశాఖపట్నం (జయ జయహే)**






ఆకాశవాణి 90 వసంతాల వేడుకల్లో భాగంగా విశాఖపట్నం కేంద్రం ఘనంగా వాకథాన్ నిర్వహించింది. ఒక వైపు సముద్రపు అలలు, మరో వైపు ఆకాశవాణి పలుకులతో ఎంతో ఉత్సాహంతో వాకథాన్ సాగింది.మంగళవారం ఉదయం కేంద్ర ప్రాంగణంలో విశాఖపట్నం జిల్లాజాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి జెండా ఊపి వాకథాన్ ప్రారంభించారు. వాకథాన్ కు ముందు ఆకాశవాణి ఉద్యోగులకువిద్యాధరి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆకాశవాణితో ఆమెకున్న బంధాన్ని, అనుబంధాన్ని పంచుకున్నారు. విలువలకు కట్టుబడి ఒక సంస్థ 90 ఏళ్లు మనుగడ సాధించడం సామాన్యమైన విషయం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి సారథ్యం వహించిన డిప్యూటీ డైరెక్టర్ జనరల్ , రీజినల్ ఛానెల్ మేనేజర్ ఆర్. హర్షలత మాట్లాడుతూ ఆకాశవాణి 90 ఏళ్ల ప్రస్థానాన్ని గురించి వివరించారు. విశాఖ కేంద్రంగా ఆకాశవాణి ఉత్తరాంధ్రకు అందిస్తున్న సేవలను తెలియజేశారు. కార్యక్రమాల విభాగాధిపతి పి.వి. రామగోపాల్ జాతి సేవలో ఆకాశవాణి గురించి వివరించారు. డైరెక్టర్ ఇంజనీరింగ్ కృష్ణారావు మార్గదర్శకత్వంలో నడక ప్రారంభమైంది. సహాయ సంచాలకులు కాశీభట్ల ఇందిరా, కార్యక్రమం నిర్వహణ అధికారులు సంఘమిత్ర పాల్ చౌదరి, ఎన్.సుధాకర్ రెడ్డి, తేతలి దిలీప్ కుమార్ రెడ్డి, అకౌంటెంట్ పావని, పూర్వ కార్య నిర్వహణాధికారి బేతా రామ సూర్య ప్రకాశరావు, పూర్వ ఉద్యోగులు బహుదూర్లా రామ్మోహన్ రావు ,కేశవరావు తదితరులు పాల్గొన్నారు. గడచిన 50 ఏళ్లుగా ఆకాశవాణి వింటున్న శ్రోత, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి మాతృ మూర్తి సుజాత వారి కుటుంబ సభ్యులు వాకతాన్ లోపాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇంజనీరింగ్, ప్రోగ్రామ్ విభాగం అధికారులు, శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాఖ్యాతలు, న్యూస్ రీడర్ లు, రేడియో జాకీలు, సంగీతం, సాహిత్యం, జానపదం, వ్యవసాయం, మహిళా విభాగం సిబ్బంది, బ్రాడ్కాస్టింగ్ అసిస్టెంట్ లు, పరిపాలనా ఇలా వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు , శ్రోతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నమ్మకం, అనుబంధం, సేవతో నిండిన సంవత్సరాలుగా ఆకాశవాణి 90 యేళ్లు పూర్తి చేసుకుంది. కలిసి నడుద్దాం, కలిసి వేడుక చేసుకుందాం అంటూ ఆకాశవాణి నినదించింది. ఆరోగ్యం, ఐక్యత, దేశం కోసం ఒక అడుగు అంటూ ఆకాశవాణి 90 ఏళ్ల ఉత్సవాలలో ఎలుగెత్తి చాటింది. 90 సంవత్సరాల స్వరాల ప్రయాణం. విశ్వసనీయత యొక్క వారసత్వంగా ఆకాశవాణి నిలుస్తోంది. సిరిపురం రేడియో కేంద్రం వద్ద మొదలైన వాకథాన్శ్రీ పాండురంగ స్వామి ఆలయం, సాగర తీరం, శ్రీ భవతరణీ మాత ఆలయం, శ్రీ రామకృష్ణ మఠం మీదుగా రేడియో కేంద్రం వరకు సాగింది. ఎంతో క్రమ శిక్షణతో సాగిన వాకథాన్ పుర ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఆకాశవాణి లోగో ముద్రించిన టీ షర్టులు, టోపీలు ధరించిన సిబ్బంది ప్ల కార్డులు చేత బూని ఆకాశవాణి ఖ్యాతిని కీర్తిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ సాగర తీరం వెంబడి నడిచారు. బహుజన హితాయా, బహుజ సుఖాయా,, సముదపు హోరు ఆకాశవాణి జోరు అంటూ చేసిన నినాదాలకు ప్రజల నుంచి మద్దతు లభించింది. రేడియో కేంద్రం కూడలిలో నిర్వహించిన మానవ హారం అందరినీ ఆకట్టుకుంది. ఎంతో ఉత్సాహంగా సాగిన మూడు కిలో మీటర్ల వాకథాన్ విజయవంతంగా ముగిసింది.



## మజ్జిగ పంపిణి చేసిన పట్టా ఫౌండేషన్

**విశాఖపట్నం (జయ జయహే) ,**

చిన్న వాల్తేరు గ్రామ దేవత శ్రీ కనకమహాలక్ష్మి ( దుర్గ ) అమ్మవారి వార్షిక జాతర మహోత్సవము సందర్భంగాభక్త జనులకు చల్లని మజ్జిగ పంపని మరియు గ్రామ ఆడపడుచులు , ముత్తైదువులు భక్తి శ్రద్ధలతో , అమ్మవారి మాలధారణలో శ్రీ కనకమహాలక్ష్మి ( దుర్గ )అమ్మవారికి సారి సమర్పించారు. హైందవ సాంప్రదాయంగా అమ్మవారికి సమర్పించిన పసుపు కుంకుమలు సౌభాగ్య ప్రీతిక తాంబూలం , చక్కెర పొంగలి నైవేద్యంను, సారి సమర్పించిన గ్రామ ఆడపడుచులు, ముత్తయిదువులకు గంధం పూసి, సుమంగళి కుంకుమను దిద్ది సౌభాగ్య ప్రీతిక తాంబూలాలు ఇవ్వడం జరిగింది .పట్టా ఫౌండేషన్ ఆధ్యాత్మిక సామాజిక సేవలు మరువలేనివని కొనియాడారు చోడే పట్టాభి రామ్ టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు, బైరెడ్డి పోతన రెడ్డి మీ టిడిపి మీడియా సెల్ కార్యదర్శి మరియు య.సి సెల్ వార్డ్ అధ్యక్షులు సత్యనారాయణ ఆలయ చైర్మన్ గుంటుబోయిన వెంకట నరసింహ మూర్తి యాదవ్ మరియు టీడీపీ వార్డు అధ్యక్షులు పీతల అమరేంద్ర యాదవ్. యువతర కల్చర్ క్లబ్ వారు ఈ యొక్క నవరాత్రులను అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందించదగ్గ విషయమ, ఆలయ చైర్మన్ గుంటుబోయిన వెంకట నరసింహ మూర్తి యాదవ్. ఆలయ ట్రస్ట్ సభ్యులు , ఆలయ ఈవో భక్తులు ఎటువంటి అసౌకర్యము లు కలగకుండా , సౌకర్యములు లో కల్పించి మహోత్సవములును నిర్వహించడం అభినందనీయం. అనుపు మహోత్సవంలో క భక్త జనాలకు ఉదయం నుండి చల్లని మజ్జిగ పంపిణి చేయడం జరుగుతుందనిపట్టా ఫౌండేషన్ కు అవకాశం కల్పించిన ఆలయ కమిటీ వారికి , ఉత్సవ నిర్వహకులు యువతారా కల్చర్ క్లబ్ కమిటీ వారికి ధన్యవాదములు ఆలయ చైర్మన్ ను ఉత్సవ కమిటీ అధ్యక్షుని దుస్సాలులతో సత్కరించారు పట్టా ఫౌండేషన్ స్థాపక అధ్యక్షులు పట్టా రమేష్ బాబు తెలియజేశారు. ఫౌండేషన్ ట్రస్టీలు ఆర్ భాస్కర్ భారతి, బొడ్డేడ వెంకటలక్ష్మి, దొడ్డి రమేష్, ఫౌండేషన్ సభ్యులు బిశేటి అఖిల , పెంటకోట నూకరాజు, శ్రీ లక్ష్మి శ్రీదేవి,అర్చన, రాజేష్ ,హర్ష వర్షిణి తదితరులు పాల్గొన్నారు.



## పరాశర జ్యోతిష్య పరిషత్ ప్రారంభం


**ధవళేశ్వరం,(జయ జయహే )**

జ్యోతిష విజ్ఞానాన్ని పరివ్యాప్తం చేయడానికి శ్రీ పరాశర జ్యోతిష పరిషత్ స్థాపించినట్లు వ్యవస్థాపకులు వేలువెంటి రాజా తెలిపారు. ధవళేశ్వరం లో స్థానిక రామ పాదాలు రేవు వద్ద మంగళవారం పరిషత్ కార్యాలయాన్ని పలువురు జ్యోతిష్య పండితులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జ్యోతిష్యం యొక్క ఔన్నత్యాన్ని సమాజానికి అందించవలసిన అవసరం సనాతన ధర్మానికి ఉందని, పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పురోహిత సంఘం అధ్యక్షులు మర్ల సీతారామశాస్త్రి జ్యోతిష్య పండితులు దీక్షితులు రామకృష్ణ, పంచాంగ కర్త ధార మొక్కల అనిల్ శర్మ తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మాదిరాజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కలగా సుబ్రహ్మణ్యం, రాజమండ్రి నగర బ్రాహ్మణ సంఘ కార్యదర్శి నిడమర్తి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత వ్యతిరేకి జగన్మోహన్ రెడ్డి

### ఆరోపించిన ఎమ్మెల్యే గంటా

**విశాఖపట్నం, మే 19, జయ జయహే**




నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన అయిదేళ్ల పాలనలో 200 మందికి పైగా దళితులను హతమార్చారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఆ ప్రకటనలో వివరాలు యిలా ఉన్నాయి. దళిత డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రమణ్యం, డాక్టర్ అచ్చెన్న ఘటనలే నిదర్శనం. జగన్ పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగాయని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో లెక్కలతో సహా వివరించింది. టీడీపీ పాలనలో 8,211 దాడులు జరగగా.. వైసీపీ పాలనలో 56,981 దాడులు జరిగాయి. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ. 27 వేల కోట్లు, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ. 5 వేల కోట్లు.. మొత్తం రూ.33 వేల కోట్లను మళ్లించి దళితులకు అన్యాయం చేశారు. దీని వల్ల ఎస్సీ, ఎస్టీలు కోట్లాది రూపాయల బ్యాంకు సబ్సిడీ రుణాలు కోల్పోయారు. అన్నమయ్య జిల్లాలో జగన్ సైకో మూకలు ఒక అధికారిపై విచక్షణరహిత దాడులకు పాల్పడ్డారు. వైసీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, అతని అనుచరులు 20 మందితో వచ్చి ఎంపీడీఓ జవహర్ బాబుపై దాడి చేయడం సిగ్గుచేటు. జగన్మోహన్ రెడ్డికి దళితుల గురించి మాట్లాడే హక్కు లేదు. డ్రైవర్ సుబ్రమణ్యం ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును జగన్మోహన్ రెడ్డి వెంటేసుకుని తిరుగుతున్నారు. తాడిపత్రిలో దళిత సీఐను వైసీపీ నేతలు కులం పేరుతో దూషించి బలవన్మరణానికి పాల్పడేలా చేశారు. కోడి కత్తి డ్రామాలో దళితుడైన జనుపల్లి శ్రీనివాస్ ను అయిదేళ్ల పాటు జైల్లో పెట్టి ఆ కుటుంబాన్ని కష్టాల పాలు చేశారు. వైసీపీ పాలనలో అక్రమ ఇసుక దందాను ప్రశ్నించిన వరప్రసాద్ అనే వ్యక్తికి శిరోముండనం చేశారు. నాణ్యత లేని మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్న వైనాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేసిన మరుసటిరోజున చిత్తూరు జిల్లాకు చెందిన వైసీపీ కార్యకర్త ఓం ప్రతాప్ అనుమానాస్పదంగా మృతి చెందడం ఆ పార్టీ దారుణాలకు పరాకాష్ట. దళితులంటే జగన్మోహన్ రెడ్డికి ప్రేమ లేదు. ఓట్లు కావాలి కాబట్టి ఎన్నికల సమయంలో మాత్రమే జగన్ కు దళితులు గుర్తుకొస్తారు. ఈ నిజాలన్నింటినీ గుర్తించే గత ఎన్నికల్లో దళితులు జగన్మోహన్ రెడ్డికి గుణపాఠం నేర్పారు.



## ప్రజా విప్లవ నేత కామ్రేడ్ సుందరయ్య

### నిజాయితీ నాయకత్వం ఆయన లక్ష్యం

### అత్యున్నత రాజకీయ విలువ కల్గిన నాయకుడు

**టెక్కలి మే 19 జయ జయహే**

భారతదేశ స్వాతంత్ర్య సమరయోధులు కమ్యూనిస్టు ఉద్యమ నే త కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నీతి నిజాయితీ కలిగిన రాజకీయ ప్రజా నాయకుడని ప్రజల జీవన విధానానికి కోసం అలుపెరుగని పోరాట యోధుడు సుందరయ్య గొప్ప నాయకుడని సిపిఎం జిల్లా నాయకులు నంబూరు షణ్ముఖరావు కొనియాడి నివాళులర్పించారు. కామ్రేడ్ సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా టెక్కలి పీకేఎం భవనంలో ప్రజా సంఘాల సారథ్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దేశంలో అత్యున్నత విలువలు కలిగిన రాజకీయ ప్రజా ఉద్యమ నేత సుందరయ్య సమ సమాజ నిర్మాణానికి ఆయన మార్గదర్శకులని కమ్యూనిస్టు ఉద్యమాన్ని గ్రామీణ స్థాయిలో తీసుకెళ్లిన మహోన్నత నాయకులు అన్నారు. భాషా సంయుక్త రాష్ట్రాలు ఏర్పాటు వ్యవసాయ ఆధారమైన రైతులకు ప్రతి ఎకరానికి సాగునీరు అందించి మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా పోరాడిన రాజకీయ నేత కామ్రేడ్ సుందరయ్య ప్రజల గుండెల్లో నే టికి నిలిచి ఉన్నారని షణ్ముఖరావు అన్నారు. తెలంగాణ భూస్వామ్య రజాకర్ల దోపిడీకి వ్యతిరేకంగా నిలిచి సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి 10 లక్షల ఎకరాల భూ పంపిణీ చేసిన విప్లవ నాయకుడు సుందరయ్య అని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సిపిఎం జిల్లా కమిటీ ప్రతినిధులు, కొల్లి ఎల్లయ్య, బాగాది వాసుదేవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ధర్మారావు, ఇప్పిలి మల్లేశు, అన్నెపు అప్పారావు, సుబ్రహ్మణ్యం, మెట్ట లక్ష్మణ దాసు, తమిరీ సూరి దేవుడు తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదాల పరిష్కారంలో వీరిదే బాధ్యత

### - మ్యూటేషన్లు రైతులకు చెప్పండి

### - తహసీల్దార్, సర్వేయర్ల సమావేశంలో జేసీ విద్యాధరి

**విశాఖపట్నం మే 19, జయ జయహే**



భూ వివాదాల పరిష్కారంలో తహసిల్దార్లు, సర్వేయర్లు బాధ్యాతా యుతంగా వ్యవహరించాలని జాయింట్ కలక్టర్ జి.విద్యాదరి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జిల్లాలో తహసల్దార్లు, డి.టిలు, సర్వేయర్లతో రీ సర్వే ఆర్ అండ్ ఆర్ ప్రజా ఫిర్యాదులు పరిష్కారం తరితర అంశాలలో వ్యవహరించాల్సిన తీరుపై జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలక్టర్ మాట్లాడుతూ రీ సర్వే, ఫీల్డ్ సర్వో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి పరిష్కారమైనట్లుగా వారికి తెలియజేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారములో అర్జీ దారులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఆర్ అండ్ ఆర్ లో మ్యుటేషన్లు జరిగితే ఆ రైతుకు తెలియజేయాలని, తిరస్కరిస్తే అందుకు కారణాలను కూడా రైతులకు తెలియజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఉప సంచాలకులు సర్వే కే.రమణ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే రామకృష్ణ, డిప్యూటి కలక్టర్ గోవింద్, కో ఆర్డినేషన్ల పర్యవేక్షకులు శ్యాం రామప్రసాద్ , తహసిల్దార్లు పాల్గొన్నారు.



## పేద బడుగు బలహీన వర్గాలకు కార్మికులకు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనియం

**బుచ్చయ్య పేట జయ జయహే**

పేద బడుగు బలహీన వర్గాలకు కార్మికులకు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శ ప్రాయమని బుచ్చయ్య పేట మండలం సిఐ టి యు మండల కార్యదర్శి పినపాత్రుని సాంబశివరావు అన్నారు. బబుచ్చయ్య పేట మండలం బంగారం మెట్ల లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సాంబశివరావు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య పేదల కోసం అనేక ఉద్యమాలు చేశారని అన్నారు. సుందరయ్య అనేక సంస్కరణలు రద్దు చేశారని ఆయన గుర్తు చేశారు పార్లమెంట్ కి సైకిల్ మీద వెళ్లి కార్మికుల కోసం ఎన్నో ఉద్యమాలను నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తాతయ్య బాబు నానాజీ బత్తుల శ్రీను స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పెంటబాబు లేని లోటు

# పేద ప్రజలకు తీరని లోటు

**బుచ్చయ్య పేట జయ జయహే**



చిరునవ్వుతోనే వైద్యం చేస్తూ ప్రజలకి వచ్చే వ్యాధిలను స్పర్శింపు తోనే వ్యాధులను నయం చేసే మహోన్నత వ్యక్తి పెంటబాబు వడ్డాదికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు బెన్నాబత్తుల శ్రీరామమూర్తి (పెంటబాబు డాక్టర్) అకాల మరణం పొందారు. అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు.అక్కడ చికిత్స పొందుతూ గత ఆదివారం రాత్రి మృతి చెందారు. వడ్డాదిలో పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించేవారు.ఫీజు లేకుండా ఎంతో మంది పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేవారు.ఆయన మృతితో వడ్డాది, చినప్పన్నపాలెం,ముకుందపురం, వీరవిల్లి, విఆర్ఆర్ పేట,బంగారుమెట్ట,తదితర గ్రామాల ప్రజలు దిగ్భ్రాంతి చెందారు.ఎల్లప్పుడూ చిరునవ్వుతో కనిపించే డాక్టర్ అకాల మరణం గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది.ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.పెద్ద సంఖ్యలో ప్రజలు సోమవారం వడ్డాదిలో వారి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారుకుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com